



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243


RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 195 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 07 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


# జలధారతో
# ప్రతి ఎకరానికి నీరు



- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- యాడికి 'జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- నీటి భద్రత..సాగునీటి సంఘాల బాధ్యత యాప్ లాంచ్
- అమరావతికి చట్టబద్ధతపై సీమ ప్రజల హర్షం
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం


**తాడిపత్రి, విశ్వం వాయిస్ న్యూస్ :** జలమే సంపద... దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 'జలధార'తో రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా జలహారతి కార్యాచరణ చేపడదామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా, యాడికిలో 'జలధార..నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొని 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. అనంతరం నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో రూపొందించిన యాప్‌ను ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

### పవన్ కల్యాణ్ ప్రతిపాదనలకు
## రైల్వేశాఖ ఆమోదం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి ఫలించింది. పిఠాపురం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ పరిధిలోకి చేరుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్న పవన్ కల్యాణ్ ప్రతిపాదనకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. ఆయన కృషితో ఈ స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. రూ.37.25 కోట్లతో ఇక్కడ మౌలిక వసతులు కల్పించనున్నారు. జనవరి నెలలో దిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్ కల్యాణ్.. రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం మిగతా .. 2లో..

### ఏపీ రాజధానిగా
## అమరావతి..
### గెజిట్ విడుదల చేసిన కేంద్రం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించింది. అమరావతికి చట్టబద్ధత కల్పించింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024 జూన్ 2 నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసినట్లు గెజిట్‌లో పేర్కొంది. ఏపీ అసెంబ్లీ మార్చి 28వ తేదీ చేసిన తీర్మానం మేరకు కేంద్ర ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)ని సవరించి అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తించింది. దానిపై ఈనెల 1, 2 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో జరిగిన చర్చల్లో 35 మంది మిగతా .. 2లో..

### 'సర్' రికార్డులను
## పునఃపరిశీలించండి : సుప్రీం కోర్టు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల మిగతా .. 2లో..

### శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల కోరిక
## గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో సాకారం
### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**టెక్కలి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల కోరిక మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుతో తీరనుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పోర్టు నిర్మాణ పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ ఏడాది చివరి నాటికి పోర్టును పూర్తి చేయాలని నిర్మాణ సంస్థల్ని ఆదేశించారు. గత వైకాపా పాలనలో మూలపేట పోర్టులో కొన్ని పనులు ప్రారంభం కాలేదని అన్నారు. శంకుస్థాపన చేస్తే పనులు జరిగినట్టా అని వ్యాఖ్యానించారు. రైల్వే లైన్, రోడ్డు నిర్మాణ పనులు జరగకపోవడంతో.. అనుకున్న సమయం కంటే పోర్టు నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు. దాదాపు మిగతా .. 2లో..

### జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతిపై
## ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను మిగతా .. 2లో..

## ప్రభుత్వం అండగా ఉంటుంది
### చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పేలుడు ఘటనలో గాయాలైన పోలీసులను పరామర్శించిన హోం మంత్రి అనిత



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పోలీసులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆమె పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన పోలీసులకు ధైర్యం చెప్పిన మంత్రి, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మిగతా .. 2లో..

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్ 2..
### భూమి నుంచి రికార్డు దూరంలోకి




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు మిగతా .. 2లో..

## 28న గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన





**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ఏప్రిల్ 28న శంకుస్థాపన చేయనున్నారు. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో దీన్ని నెలకొల్పనున్నారు. ఈ నెల 28న పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ పాల్గొంటారు. డేటా సెంటర్‌కు విశాఖ సమీపంలో మూడు చోట్ల 601.4 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. జులై 2028 నాటికి ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ 'రైడెన్ ఇన్ఫోటెక్', 'అదానీ ఇన్‌ఫ్రా' భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు.

### తిరుమల శ్రీవారి హుండీకి
## రద్దయిన నోట్లు



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి హుండీలో గతంలో రద్దు చేసిన రూ.500, రూ.1000 నోట్లను భక్తులు ఇప్పటికీ కొద్ది మొత్తంలో సమర్పిస్తున్నారు. ప్రస్తుతం తితిదే వద్ద రూ.400 కోట్లకు పైగా రద్దయిన నోట్లు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ నోట్లను మార్పిడి చేసేందుకు తితిదే యత్నించినా కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో పాటు బ్యాంకుల్లో మారని రూ.2 వేల నోట్లను భక్తులు కానుకగా సమర్పిస్తున్నారు. ప్రతినెల రూ.35 లక్షల వరకు రూ.2 వేల నోట్లు హుండీలో భక్తులు సమర్పిస్తున్నారు. ఈ రూ.2 వేల నోట్లను ప్రతి రెండు నెలలకు ఒకసారి చెన్నైలోని ఆర్బీఐ రీజినల్ కేంద్రంలో మార్పిడి చేసుకుంటున్నట్లు పరకామణి ఇన్‌ఛార్జి డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

### అమెరికా ప్రతిపాదనలకు
## ఇరాన్ 'నో'




**టెహ్రాన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో అమెరికా చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. ఈ మేరకు పాకిస్థాన్ ద్వారా తన స్పందనను తెలియజేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. తాము తాత్కాలిక సంధికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పిన ఇరాన్.. ఈ యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. మరోవైపు, ఇరాన్ ఈ సందర్భంగా 10 డిమాండ్లను అమెరికా ముందు ఉంచినట్లు సమాచారం. ఘర్షణలకు ముగింపు పలకాలని, హర్మూజ్ జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణానికి నియమావళి రూపొందించడంతో పాటు ఆంక్షలను ఎత్తివేయడం, మిగతా .. 2లో..

## ఆయుర్వేద కళాశాల తరలింపు
### చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు తెలియదు - కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనువాస్
### కాకినాడ ఆయుర్వేద కళాశాలను తరలిస్తే దశలు వారి పోరాటం..
### ఎంపీ ఎమ్మెల్యేలను కలిసిన అఖిలపక్షం..



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ గర్ల్స్ పాలిటెక్నిక్ ఆనుకుని ఉన్న కాకినాడ ఆయుర్వేద ఆసుపత్రి పక్కనే కళాశాల నిర్మించాలని అక్కడ పిఠాపురంనకు తరలిస్తే అఖిలపక్షం వివిధ ప్రజా సంఘాలు విద్యార్థులతో దశలు వారి పోరాటం నిర్వహిస్తామని ప్రముఖ న్యాయవాది ఆయుర్వేద కాకినాడ ఆయుర్వేద కళాశాల నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ డాక్టర్ జవహర్ ఆలీ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ కాకినాడ సిటీ శాసనసభ్యులు వనవాడి వెంకటేశ్వరరావు కొండబాబుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ కాకినాడ జిల్లా కాకినాడ చీడిల్ పోరగర్ల్స్ పాలిటెక్నిక్ ప్రాంగానికి అనుకొని ఏడు ఎకరాల మిగతా .. 2లో..

### ఇరాన్ మొత్తం ఒక్కరోజులో
## తుడిచిపెట్టుకుపోవచ్చు
### ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌ను మంగళవారం పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇరాన్ మొత్తం ఒక్కరోజులో తుడిచిపెట్టుకుపోవచ్చని వ్యాఖ్యానించారు. అమెరికా చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనను తాజాగా ఇరాన్ తిరస్కరించిన నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను చాలా నిరాశకు మిగతా .. 2లో..

### ధరల పెరుగుదల
## భారత్‌లో కాదు.. పాకిస్థాన్‌లో
### రాహుల్‌కు అమిత్ షా కౌంటర్



**పుదుచ్చేరి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తోన్న ఆరోపణలను కేంద్ర మంత్రి అమిత్ షా గట్టి కౌంటర్ ఇచ్చారు. ధరలు పెరిగిన విషయం వాస్తవమేనని, కానీ అది భారత్‌లో కాదు పాకిస్థాన్‌లో అని గుర్తుచేశారు. ఈ విషయాన్ని రాహుల్ గమనించాలంటూ కౌంటర్ ఇచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచమంతటా ఇంధన కొరత ఏర్పడింది. ధరలు ఆకాశాన్నంటాయి. కొన్ని దేశాలు వర్క్ ఫ్రం హోమ్‌కు ఆదేశాలిచ్చాయి. వీటన్నింటినీ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# జలధారతో ప్రతీ ఎకరానికి నీరు

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాం. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి..నిలబడిన నీటిని జలాశయంలో చేసేందుకు ప్రయత్నించాలి. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం లాంటి అనేక ప్రయత్నాలు చేసి ముందుకు వెళ్లాం. పంట కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాలకు వేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా ట్రెంచ్‌లు, నీరు చెట్టు, నీరు-మీరు, నీరు-ప్రగతి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. అనంతపురం లాంటి ప్రాంతాల్లో కొన్ని ఏళ్లపాటు నీరే లేదు. నష్ట పోతున్న రైతులను ఆదుకోడానికి ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చింది కూడా టీడీపీనే. అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ కార్యక్రమం తీసుకువచ్చాం. 90 శాతం మేర సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇచ్చింది కూడా గతంలో మేమే. మైక్రో ఇరిగేషన్‌పై గతంలో ఇచ్చిన నివేదికే ప్రామాణికంగా మారి దేశంలో అంతా వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నాం. డ్రిప్ ఇరిగేషన్ వల్లే రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. హార్చికల్చర్‌లో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**పూర్వోదయతో సీమ అభివృద్ధి**

రాయలసీమ అభివృద్ధికి ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు వస్తాయన్నారు. 'పెట్టుబడులు ద్వారా మరో రూ.70 వేల కోట్ల రాబట్టి అభివృద్ధి చేస్తాం. గడిచిన 21 నెలల్లో నీటి భద్రతా పరంగా చాలా మార్పులు వచ్చాయి. చెరువులు పెద్ద ఎత్తున నింపగలిగాం. జల సంరక్షణా చర్యల కారణంగా భూగర్భ జలాలను 1.92 మీటర్ల మేర అదనంగా పెంచగలిగాం. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్లుగా భూగర్భజలాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే ఇప్పుడు 11 మీటర్లకే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. చేపట్టిన భూసంరక్షణ చర్యల కారణంగా 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాల్లో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారు. ఈ ఉద్యమంలో ప్రజలందరికీ నేను తోడుగా ఉంటాను. జిల్లాలో 5.7 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. 20 వేలకుపైగా ఎండిన బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చింది. ఒక్క జిల్లాలో రూ.96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. భూగర్భజలాలు పెరగటం మూలంగా హరిత ప్రాంతం పెరిగింది. ఇవన్నీ సానుకూలమైన అంశాలు' అని ముఖ్యమంత్రి అన్నారు.

**రబీ, ఖరీఫ్‌కు సమృద్ధిగా నీరు**

వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతున, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. తద్వారా రాష్ట్రంలో నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చని అన్నారు. "రిజర్వాయర్లలో నీళ్లు నిండుగా ఉంటే ఎప్పటికప్పుడు మనం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం నీటిని వేర్వేరు చోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నీరు తెచ్చుకుంటున్నాం. రాష్ట్రంలోనూ, రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకూ నీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు, పరిశ్రమలకు 28, తాగునీటికి 158 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. మొత్తంగా 1300 టీఎంసీల వరకూ నీటి అవసరం ఉంటుంది. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకువచ్చాం. హంద్రీనీవా ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు తీసుకెళ్లాం. పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు తీసుకువచ్చి రబీకి, ఖరీఫ్‌కు ఇచ్చే నీటిని ఆదా చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు తరలించాం. భూమినే జలాశయంగా మార్చుకుని వినియోగించుకోవటం ద్వారా మెరుగైన నీటి నిర్వహణ చేపట్టవచ్చు. రబీ, ఖరీఫ్ పంటలు పూర్తి అయ్యాక కూడా ప్రస్తుతం మన రిజర్వాయర్లలో 65 శాతం నీటి నిల్వ ఉంది. దేశంలోనే అతితక్కువ వర్షపాతం పడే అనంతపురం జిల్లా కూటమి ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా ఎక్కువ పండ్ల తోటలతో సంపన్నమైన ప్రాంతంగా మారిందని అన్నారు. గత పాలకులు విద్యుత్ ఛార్జీలు పెంచారని, రూ.1.24 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని అన్నారు. కూటమి వచ్చాక గత ప్రభుత్వం పెంచిన సుమారుగా రూ.4,400 కోట్ల భారాన్ని కూడా ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. అలాగే తొలిసారి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**పిచ్చి ముదిరి మావిగన్ మాటలు**

గత పాలకులు రాష్ట్ర ప్రజలకు అడ్రస్ లేకుండా చేశారని, ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని సీఎం వ్యాఖ్యానించారు. 'గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికారు. ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది. పిచ్చి ముదిరి మావిగన్ అంటూ కొత్తపేరు తీసుకొచ్చారు. అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారు. బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. చూసి సహించలేక ఫ్రస్టేషన్‌తో అవినీతి జరిగిందని అంటున్నారు. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నాం. దీనికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం. ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ గోదావరి వరకూ విశాఖ, ప్రకాశం- నెల్లూరు వరకూ అమరావతి, తిరుపతి కేంద్రంగా రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి రీజియన్లుగా తయారవుతాయి' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెట్టుబడులు వస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు**

గత పాలకులు రాష్ట్రంపై పగపట్టారని, రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతీ జిల్లాను అభివృద్ధి చేస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ఎదురు దాడి చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదం నాణ్యతను దెబ్బతీశారు. కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారు. రాష్ట్రంపై విద్వేషం చూపించే వారికి సహకరిస్తే పౌరులందరికీ నష్టం కలుగుతుంది. పెట్టుబడులు తీసుకువస్తుంటే వారిని బెదిరిస్తున్నారు. ఇలాంటి వారిని దూరం పెట్టాలి. కరెంటు, నీరు లాంటి దీర్ఘకాలిక సమస్యలను క్రమంగా పరిష్కరించుకుందాం. అందరికీ సమర్థవంతమైన, జవాబుదారీ పాలన ఇవ్వాలన్నదే మా లక్ష్యం. రాష్ట్రమే నా కుటుంబం. అందరికీ న్యాయం చేసే బాధ్యత మాది. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేయూత అందిస్తున్నాం. పెట్టుబడులు వస్తే.. ఆదాయం వస్తుంది అప్పుడే సంక్షేమం చేయగలం. సుపరిపాలనకు ప్రజలంతా సహకరించాలని' చంద్రబాబు విజ్ఞప్తి చేస్తున్నాను.

**ప్రజల ముందే ప్రజంటేషన్**

అనంతపురం జిల్లా, తాడిపత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను యాడికి జలధార సభలో ముఖ్యమంత్రి చదవి వినిపించారు. వివిధ శాఖల పనితీరు నివేదికలను ప్రజల ముందు ప్రజెంట్ చేశారు. సరిగ్గా పనితీరు కనబరచని వివిధ శాఖలకు చెందిన అధికారులను వేదికపైకి పిలిపించి వివరణ అడిగారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తామని... అధికారులు, ఉద్యోగులు కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. భూవివాదాలనేవి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారా..? అని ప్రజలనే నేరుగా సభలో సీఎం అడగ్గా... ఎవ్వరూ అడ్డుకోవడం లేదని ప్రజలు బదులిచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ...ఆదాయం తగ్గినా పర్వాలేదనుకుని ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్నారు.బాగా పని చేసిన అధికారును అభినందించాలంటూ ప్రజలతోనే సభలో చప్పట్లు కొట్టించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా సూపర్ అచీవర్స్.. అచీవర్స్.. పెర్ఫార్మర్స్.. లెర్నర్స్ గా విభజిస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో...ఇకపై తాను వచ్చే ప్రతీ సభకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం హాజరవ్వాలని ఆదేశించారు.

**జై అమరావతి అంటూ నినాదాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార కార్యక్రమంలో ప్రజావేదిక సభకు వచ్చేముందు ప్రజలు జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ చట్టబద్దత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వయంగా అమరావతి లోగో పట్టుకుని సభకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. యాడికిలో సీఎం హెలిక్యాప్టర్ దిగాక అమరావతి బ్యాడ్జిని అందించారు. సభలో రాజధానికి చట్టబద్దతపై హర్షం వ్యక్తం చేస్తూ ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఓ దిక్కుమాలిన పార్టీ అంటూ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రం మీద పగ పట్టినట్టు వైసీపీ వ్యవహరిస్తోందన్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. సభ అనంతరం పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఆమోదానికి గుర్తుగా సీఎంకు అమరావతి జ్ఞాపికను జేసీ పవన్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగానికి ముందు ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. నీటి సంరక్షణకు అనంతపురం జిల్లా, నియోజకవర్గంలో చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి వివరించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలను ఫొటో ఎగ్జిబిషనులో అధికారులు ప్రదర్శించారు. డ్వాక్రా, స్థానిక మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్‌ను, గ్రానైట్, డొలమైట్, సున్నపురాయి గనులకు సంబంధించిన స్టాల్ ను సందర్శించారు. హార్టికల్చర్ ఉత్పత్తులను కూడా సీఎం చంద్రబాబు పరిశీలించారు.

### పవన్ కల్యాణ్ ప్రతిపాదనలకు

# రైల్వేశాఖ ఆమోదం

ప్రత్యేకంగా చర్చించారు. అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా ఆయన ప్రతిపాదనలను రైల్వేశాఖ అంగీకరించింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల కోరిక

# గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో సాకారం

74 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా జగన్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

# అమెరికా ప్రతిపాదనలకు ఇరాన్ 'నో'

పునర్నిర్మాణానికి సంబంధించి పలు నిబంధనలు ఇందులో ఉన్నాయి. 'మేం కేవలం కాల్పుల విరమణను మాత్రమే అంగీకరించం' అని కైరోలోని ఇరాన్ దౌత్యమిషన్ అధిపతి మొజ్తబా ఫెర్దౌసీ 'ది అసోసియేటెడ్ ప్రెస్'తో అన్నట్లు సమాచారం. తమపై మళ్లీ దాడి జరగదనే హామీలతో కూడిన యుద్ధం ముగింపునకు మాత్రమే అంగీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై బాంబుదాడులు జరిపేందుకు ట్రంప్ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ తరహా స్పందన రావడం గమనార్హం.

**ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు: ట్రంప్**

అమెరికా చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. "నేను చాలా నిరాశకు గురయ్యాను. వాళ్లు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. ఇరాన్ చేయాల్సినవి చేస్తే ఈ ఉద్రిక్తతలు త్వరగా ముగిసిపోవచ్చని పేర్కొన్నారు.

### ఏపీ రాజధానిగా

# అమరావతి..

సభ్యులు సుమారు 260 నిమిషాలు చర్చించి మూజువాణీ ఓటు ద్వారా ఆమోదముద్రవేశారు. అందులో వైకాపాకు చెందిన ఇద్దరు మినహాయించి మిగిలిన 33 మంది అమరావతికి జై కొట్టారు. పార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 కింద తన అధికారాలను అనుసరించి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

### 'సర్' రికార్డులను

# పునఃపరిశీలించండి : సుప్రీం కోర్టు

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునళ్లను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీం ఆదేశించింది. ట్రైబ్యునళ్ల పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పీలేట్ ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది.

### జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతిపై

# ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. "మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం" అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని రద్దు చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

# ప్రభుత్వం అండగా ఉంటుంది

మంత్రి అనిత మాట్లాడుతూ, చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న దుకాణాల నుంచి సీజ్ చేసిన పేలుడు పదార్థాలను కోర్టుకు తరలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పేలుడు సంభవించిందని చెప్పారు. ఈ ఘటనలో ఎస్సై, కోర్ట్ కానిస్టేబుల్ మరియు ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడినట్లు వివరించారు. అబ్దుల్లా అనే కానిస్టేబుల్‌కు 50-60 శాతం గాయాలున్నాయని, మిగతా వారికి ప్రాణాపాయం లేదని మంత్రి తెలిపారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గాయపడిన పోలీసులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మంత్రి, వారి కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. అత్యుత్తమ వైద్యం అందిస్తున్న ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్య బృందానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్ 2..

దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్‌మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చు.

# ఆయుర్వేద కళాశాల తరలింపు

ప్రభుత్వం భూమి ఉందని, అందులో రెండు ఎకరాల ఆయుర్వేద హాస్పిటల్ నిర్మించారాణి నిబంధనల ప్రకారం హాస్పటల్ ఉన్నచోటనే కళాశాల నిర్మించాలని, సుమారు 15 కోట్లతో 50 పడకల ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయ్యిందని, ఇంకా ఐదు ఎకరాల భూమి మిగిలి ఉన్నదని అందులో కళాశాల నిర్మాణానికి ప్రతిపాదనలు పూర్తి అయినాయని, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ గారు 70 కోట్లతో కళాశాల కోసం నిధులు విడుదల కోసం కృషి చేశారని అవి మంజూరు కూడా అయ్యాయని మధు అన్నారు. ప్రముఖ న్యాయవాది జవహర్ హాలి మాట్లాడుతూ మొదటి దఫగా ఈ ఆర్థిక సంవత్సరంలోపే మార్చి 31వ తేదీ లోపు ఏడు కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయాలని కానీ ఆ కళాశాల భూమిపై భూ కసారుల కన్ను పడిందని దీంతో ఆస్పత్రి కూడా ప్రారంభం కాలేదని ఆయన అన్నారు. గత మూడు వారాల క్రితం వివిధ పత్రిక పత్రికల్లో కళాశాల నిర్మాణ స్థలంలో పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్వీఎస్ఎన్ వర్మ కన్స్ట్రక్షన్ పేరుతో ఫైవ్ స్టార్ తాజ్ హోటల్ పేరుతో జీవో నెంబర్ 17 జీవోను టూరిజం డిపార్ట్మెంట్ విడుదల చేసిందని వాస్తవంగా చెప్పాలంటే తాజ్ ఇంటర్నేషనల్ సంస్థ ఎటువంటి ప్రకటన చేయలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందం రావు మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ దురుద్దేశంతో ఎస్ వి ఎస్ ఎన్ వర్మకు రెండు కోట్లు విలువ చేసే ప్రజల ఆస్తి ప్రభుత్వ భూమిని అప్పనంగా ఒక ప్రైవేటు వ్యక్తికి అప్పగించడం చాలా హేయమైన చర్య అని అసలు అక్కడ నిర్మించేది తాజ్ హోటల్ కాదని వర్మ వ్యక్తిగత కళ్యాణ మండపం అని కన్వెన్షన్ హాల్ మాత్రమే నిర్మించుకోవడానికి తాజ్ ఇంటర్నేషనల్ కాకినాడలో నిర్మించడానికి ఎవరికి అభ్యంతరం లేదని కాకినాడలో కావలసిన స్థలాలు ఉన్నాయని వాటిని కనుగొన చేసి హోటల్ కట్టుకోవచ్చని ఆయన అన్నారు. అమ్ ఆద్మీ పార్టీ నాయకులు నరాల శివ మాట్లాడుతూ పిఠాపురంలో గత ప్రభుత్వం పేదల కోసం మన్యం భూమిలో 20040 మందికి పేదల ఇళ్ల స్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ కూడా చేశారని ఆ స్థలాన్ని ఇప్పుడు ఆయుర్వేద జూనియర్ కళాశాలకు నిర్మించడానికి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని పేదవాడి భూమిని లాక్కుని వాడి నోట్లో మట్టు కొడుతున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామారెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టీయూసీ ఏపీ అండ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాలూరి రాజు, ధారా రామకృష్ణ, మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవాని, కే అరుణ, దీ. పావని తదితరులు పాల్గొన్నారు

### ఇరాన్ మొత్తం ఒక్కరోజులో

# తుడిచిపెట్టుకుపోవచ్చు

గురయ్యాను. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆ దేశాన్ని ఒక్క రాత్రిలోనే మట్టుబెట్టగలం. శత్రువుల ప్రాంతాల్లోకి ఎఫ్-15 యుద్ధ విమానం చొచ్చుకెళ్లింది. మేం ప్రయోగించిన వేల విమానాల్లో ఒక్కటి మాత్రమే కూలింది. ఎఫ్-15 ఫైటర్ జెట్ పైలట్‌ను ప్రమాదకరమైన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి రక్షించుకోగలిగాం. అయితే, ఈ రెస్క్యూ ఆపరేషన్ గురించి ఇరాన్‌కు ముందే తెలిసింది. భూమికి దగ్గరగా వచ్చిన జెట్ గురించి ఎవరో లీక్ చేశారు. ఒకరిని కాపాడటం, మరొకరి గల్లంతుపై ఎవరో లీక్ చేశారు. ఒక్క వ్యక్తిని పట్టుకోవడానికి 200 మందిని పంపించారు. మా పైలట్‌ను పట్టుకున్న వారికి ఇరాన్ బహుమతి ఇచ్చింది. సమాచారం లీక్ చేసిన అధికారి కచ్చితంగా శిక్ష అనుభవిస్తాడు. సమాచారం లీక్ వల్ల ఆపరేషన్ మరింత క్లిష్టతరమైంది. మొదటి పైలట్‌తో గంట వరకు మాట్లాడలేకపోయాం. 4 బాంబర్లు సహా 55 ఎయిర్‌క్రాఫ్ట్, 64 ఫైటర్లు, 13 రెస్క్యూ ఎయిర్‌క్రాఫ్ట్, 48 ట్యాంకర్లతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాం. సైన్యం ఇప్పటి వరకు చేపట్టిన అత్యంత భారీ, సంక్లిష్టమైన ఆపరేషన్ ఇదే. ప్రమాదకరంగా జరిగిన గాలింపు చర్యల్లో విజయం సాధించాం. మా ఆపరేషన్‌కు చాలా మంది గొప్ప వ్యక్తులు సహాయం చేశారు. ఏ దేశానికి లేని విధంగా అమెరికాకు ఆయుధాలున్నాయి. ఇలాంటి రెస్క్యూ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం గౌరవంగా భావిస్తున్నాం. ఈ ఆపరేషన్ అమెరికా చరిత్రలో నిలిచిపోతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

### ధరల పెరుగుదల

# భారత్‌లో కాదు.. పాకిస్థాన్‌లో

భారత్ అధిగమించింది. యుద్ధ పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది. పెట్రోలియం ఉత్పత్తులను ప్రజలందరికీ అందుబాటులోనే ఉంచింది. ధరలను స్థిరంగానే కొనసాగించింది. రాహుల్ చెబుతున్నది వాస్తవమే. పెట్రోల్ ధరలు రూ.458కి పెరిగాయి. డీజిల్ ధరలు రూ.520కి చేరాయి. కానీ ధరలను పెంచింది ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్ అని ఆయన గుర్తించాలి" అని షా చమత్కరించారు. అలాగే, రాష్ట్రంలో తమ కూటమి భారీ మెజారిటీతో గెలిస్తే పుదుచ్చేరి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఎడిటర్ వాయిస్

## అమరావతి బిల్లు... మరో కీలక పరిణామం! ఇదే ఫైనల్

రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన అమరావతి బిల్లును సోమవారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో చర్చించిన తర్వాత రాష్ట్రపతి కార్యాలయం బిల్లును ఆమోదిస్తూ ప్రకటన చేయనుంది. ఈ ప్రకటన వచ్చిన తర్వాత రాజధానిగా అమరావతికి శాశ్వత హోదా, చట్టబద్ధత లభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. నాలుగు రోజుల క్రితమే రాజ్యసభ ఆమోదించినప్పటికీ వరుస సెలవులు రావడంతో బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపడం ఆలస్యమైందని అంటున్నారు.

అమరావతి ఏపీ శాశ్వత రాజధానిగా పేర్కొంటూ అసెంబ్లీ పంపిన తీర్మానాన్ని పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. అంతేకాకుండా బిల్లుకు ఎలాంటి సవరణలు చేయకుండా యథాతథంగా ఆమోదించాయి. దీంతో అమరావతి బిల్లును రాష్ట్రపతికి నివేదించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం పెట్టిన తర్వాత అమరావతి బిల్లు చట్టంగా రూపొందనుంది. అంతేకాకుండా 2024 జూన్ నుంచి ఏపీకి అమరావతి రాజధానిగా కేంద్రం అధికారికంగా గుర్తించినట్లు అవుతుందని అంటున్నారు.

అమరావతికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తర్వాత, రాజధాని హోదా కల్పిస్తూ అధికారిక గెజిట్ విడుదల చేయనున్నట్లు చెబుతున్నారు. ఇది ఇంగ్లీషు, హిందీ భాషల్లో ఉంటుందని అంటున్నారు. అదేవిధంగా రాజధానికి ప్రత్యేకమైన పిన్ కోడ్ అందుబాటులోకి తెస్తారని కూడా చెబుతున్నారు. అమరావతికి చట్టబద్ధత వచ్చిన తర్వాత రాజధానిలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. సీఆర్డీఏ పరిధిలోని మొత్తం ప్రాంతాన్ని రాజధానిలో అంతర్భాగంగా చూస్తారని వ్యాఖ్యానిస్తున్నారు.

రాజధాని చట్టబద్ధత విషయమై కూటమి ప్రభుత్వం చాలా పట్టుదల ప్రదర్శిస్తోంది. ఇప్పటికే 21 నెలల ఆలస్యమైందని, వెంటనే బిల్లును సభలో ప్రవేశపెట్టి ఏపీ పునర్విభజన చట్టాన్ని సవరించాలని కూటమి పార్టీలు చాలాకాలంగా కేంద్రంలో అధికార బీజేపీపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతోనే కేంద్ర ప్రభుత్వం కూడా బిల్లు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని రాజధానికి రాష్ట్రపతి నుంచి ఆమోదముద్ర వేయించాలని ప్రయత్నిస్తోందని అంటున్నారు.

దేశంలోని దాదాపు 40 పార్టీల పార్లమెంటు సభ్యులు అమరావతి బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇటు లోక్ సభ, అటు రాజ్యసభలో అన్నిపార్టీల వారు అమరావతికి అనుకూలమన్న ప్రకటనలే చేశారు. అదే సమయంలో ఏపీలో ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ మాత్రం బిల్లును వ్యతిరేకించింది. ఉభయ సభల నుంచి ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. కానీ, మిగిలిన అన్నిపక్షాలు అమరావతికి ఆమోదం తెలుపుతూ ఏపీ పునర్విభజన చట్టానికి అనుకూలంగా ఓటేయడంతో అమరావతి ఇక నుంచి చట్టబద్ధమైన రాజధానిగా రూపాంతరం చెందనుందని వ్యాఖ్యానిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## బంధం బలపడకముందే.. విధి బలి తీసుకుంది

### రోడ్డుప్రమాదంలో కాబోయే బావ, బావమరిది మృతి





**అశ్వారావుపేట గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంకొద్దిరోజుల్లో వారి బంధం బలపడేది. ఒకరి కష్టసుఖాలు, బరువు బాధ్యతల్ని మరొకరు పంచుకునేవారు. ఈలోపే వారి మధ్య అనుబంధం పెనవేసుకుంది. ఓ శుభకార్యానికి కలిసికట్టుగా హాజరై.. తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డుప్రమాదం ఆ ఇద్దరినీ పొట్టన పెట్టుకుంది. అప్పటివరకు తమతోపాటు సంతోషంగా గడిపిన వారు మృత్యువాత పడ్డారని తెలుసుకున్న బంధువులు, వారి కుటుంబాల్లో తీరని శోకం నెలకొంది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం తాటిరామన్నగూడేనికి చెందిన మడకం సంతోష్(19) అక్కకు అదే గ్రామానికి చెందిన, వరుసకు బావ అయ్యే పందు సందీప్‌తో ఇటీవలే నిశ్చితార్థం జరిగింది. ఈ ఇద్దరు కలిసి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం చిచ్చోడిగుంపునకు చెందిన సంతోష్ మేనమావ చిచ్చోడి సత్తిపండు కుమార్తె పుట్టినరోజు వేడుకకు హాజరయ్యారు. స్వగ్రామం తిరిగొస్తున్న క్రమంలో గాండ్లగూడెం శివారులో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో సంతోష్, సందీప్‌లకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు

**అండగా ఉంటారనుకుంటే..**

సంతోష్ తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. సోదరి వివాహ పనుల్లో నిమగ్నమయ్యాడు. సందీప్ సైతం వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబానికి బాసటగా ఉంటున్నాడు. సందీప్.. సంతోష్ సోదరిని ఏడాది కాలంగా ప్రేమించి, పెళ్లికి ఒప్పించాడు. యువకులిద్దరూ రోడ్డుప్రమాదంలో మృతి చెందటంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనాస్థలిని ఎస్సై అఖిల సందర్శించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## ఆటలో ఘర్షణ.. కత్తిపోటుతో యువకుడి దుర్మరణం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆటలో తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో మద్యం మత్తులో ఓ యువకుడిని మరో యువకుడు కత్తితో పొడిచి హతమార్చిన ఘటన విశాఖలో చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వర రావు తెలిపిన వివరాలిలా.. పెదగదిలి కొండవాలుకు చెందిన డిగ్రీ విద్యార్థి డోల అజిత్ (23) తన స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం క్రికెట్ ఆడారు. ఆటలో ఘర్షణ తలెత్తింది. గతవారం పోలమాంబ పండగలో కూడా అజిత్ స్నేహితులతో కిషోర్ అనే వ్యక్తి ఘర్షణ పడ్డాడు. ఆదివారం రాత్రి 8గంటల ప్రాంతంలో మద్యం తాగి ఉన్న కిషోర్ పెదగదిలి కూడలిలో అజిత్‌తో గొడవపడి, కత్తితో పొడిచి పారిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అజిత్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అజిత్ మరణించాడు. నిందితుడు ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

## 3,000 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

**పేట్‌బషీరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గుట్టుచప్పుడు కాకుండా రూ.30 లక్షల విలువైన 3వేల కిలోల నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ పేట్‌బషీరాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని కర్నూలు పట్టణానికి చెందిన సాంబశివరావు నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. అదేజిల్లా కోస్గి మండలానికి చెందిన నర్సింహులు తన వాహనంలో నకిలీ విత్తనాలను నాగ్‌పుర్‌కు తీసుకెళ్లేందుకు రూ.30 వేలకు కిరాయికి మాట్లాడుకున్నాడు. డ్రైవర్ రమేశ్‌ను తీసుకొని నర్సింహులు 3,000 కిలోల నకిలీ పత్తి విత్తనాలను వాహనంలో సర్ది వాటిపైన క్యాబేజీ బస్తాలను వేశారు. ఇరువురు శుక్రవారం శంషాబాద్ మీదుగా నాగ్‌పుర్ వెళ్తుండగా మేడ్చల్ ఓఆర్ఆర్ వద్ద పోలీసులు తనిఖీ నిర్వహించారు. వాహనంలో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయని.. వాటి విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. దీంతో వాహనంతోపాటు విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## పరువు హత్యకు సహకరించిన సీఐపై వేటు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్లలో ప్రేమవివాహం చేసుకున్న యువతి పరువుహత్య కేసులో ప్రధాన నిందితుడికి సహకారం అందించిన మాచర్ల పట్టణ సీఐ టి.వెంకటరమణను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం అర్ధరాత్రి ఆదేశాలు జారీచేశారు. మాచర్లకు చెందిన చంద్రశీను, గంగ దంపతుల కుమార్తె చౌడేశ్వరి మార్చి 18న హత్యకు గురైంది. ప్రేమవివాహం చేసుకుని తన పరువు తీసిందన్న కోపంతో తండ్రే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. చౌడేశ్వరి తాను ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకుని నరసరావుపేటలో కాపురం పెట్టింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తండ్రి తన కుమార్తెను అప్పగిస్తే డబ్బు ఇస్తానని సీఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇందుకు ఓ తెదేపా నేత మధ్యవర్తిత్వం వహించారు. ఈ క్రమంలో సుమారు రూ.7 లక్షలు చేతులు మారినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. నరసరావుపేటలో ఉన్న ప్రేమజంటను పోలీసులు మాచర్లకు తీసుకొచ్చారు. తాను మేజర్‌నని, పెళ్లి చేసుకున్న వ్యక్తితోనే ఉంటానని యువతి చెప్పినా ఆమె తల్లిదండ్రులతో పాటు సీఐ ఒప్పుకోలేదు. బంగారం, నగదు దొంగతనం చేసినట్లు కేసు పెడతానని సీఐ బెదిరించి యువతి పుట్టింటికి వెళ్లేలా చేశారు. ఇంటికి తీసుకెళ్లిన కుమార్తె ముఖంపై దిండు అదిమిపెట్టి తండ్రి హత్య చేశాడు. హత్య జరిగిన రోజు సీఐ సెలవు పెట్టడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పోస్టుమార్టం నివేదికను తారుమారు చేయించేందుకు ప్రయత్నించినట్లు అభియోగాలున్నాయి. ఈ కేసులో సీఐకి నగదు బదిలీ చేయడంలో కానిస్టేబుల్‌తో పాటు ఓ హోంగార్డు పాత్ర కూడా ఉన్నట్లు పోలీసు అధికారుల దర్యాప్తులో తేలింది. వారిపైనా చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

## పిడుగుపాటుకు తల్లీకుమార్తెల దుర్మరణం

### ఐదు నెలల కిందట తండ్రి మృతి – ఒంటరైన పెద్ద కుమార్తె



**మందస (హరిపురం), విశ్వం వాయిస్ న్యూస్ :** పిడుగుపాటుకు గురై తల్లీకుమార్తెలు దుర్మరణం చెందిన హృదయవిదారక ఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలం నారాయణపురం పంచాయతీ పెద్దకేసుపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మడియా కృష్ణకుమారి (40), తన రెండో కుమార్తె యోగేశ్వరి (15) జీడిపిక్కలు ఏరడానికి ఆదివారం తోటకు వెళ్లారు. ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వర్షం కురవడంతో ఇంటికి వెళ్లిపోదామని సిద్ధమవుతున్న సమయంలో వారున్న చోట పిడుగు పడి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణకుమారి భర్త మధుసూదనరావు ఐదు నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఇద్దరు కుమార్తెలనూ తల్లే పెంచుతున్నారు. యోగేశ్వరి ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాసింది. తల్లి, చెల్లి మృతిచెందడంతో పెద్ద కుమార్తె లక్ష్మీకాంతం ఒంటరైంది. ఇక తాను ఎవరి కోసం బతకాలని ఆమె రోదిస్తుండగా.. స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. బాధిత కుటుంబానికి రూ.4 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం తరఫున మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు.

## మత్తు పార్టీలో భార్యాభర్తలు

### పాజిటివ్ వచ్చిన వారిలో బాలీవుడ్ నటుడు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మోర్ దేన్ ఫ్రెండ్స్' పేరుతో నిర్వహించిన మత్తు పార్టీలో భార్యాభర్తలు, బాలీవుడ్ నటుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ గోల్కొండ సమీపంలోని తారామతి బారాదరి రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన పార్టీలో మాదక ద్రవ్యాలు ఉపయోగిస్తున్నారన్న అనుమానంతో శనివారం అర్ధరాత్రి ఈగల్ టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌వింగ్(హెచ్‌న్యూ), గోల్కొండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 35మందిని పరీక్షించగా బాలీవుడ్ నటుడు, మోడల్ అబ్దుల్ సర్వర్, యోగేశ్వర్, అభినాశ్ ఫణి, బ్రెట్ జాసన్, భార్యాభర్తలు నిహార్, ఆషి గంజాయి, కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారించారు. డీజే జాసన్ సూచనతో అభినాశ్ పార్టీలో పాల్గొన్నట్లు తేలింది. హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరుకు చెందిన విద్యార్థులు, యువతీ యువకులు పార్టీకి హాజరయ్యారు. హైదరాబాద్ నార్కొటిక్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరికి డ్రగ్స్ ఎలావచ్చాయనే దానిపై పోలీసులు ఆరాతీస్తున్నారు. సుమారు 300 మంది పార్టీలో పాల్గొన్నారని, వీరిలో హైదరాబాద్‌కు చెందిన వారు చాలా తక్కువగా ఉన్నట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు.

# హెల్త్ వాయిస్

**1. రోజుకు ఒక కొబ్బరికాయ న్యూరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు నరాల క్షీణత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**2. రోజుకు ఒక వాల్‌నట్ సైకియాట్రిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– ఒమేగా–3లు పుష్కలంగా ఉంటాయి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడతాయి మరియు మానసిక స్థితికి తోడ్పడతాయి.

**3. రోజుకు ఒక ఉసిరికాయ ఇమ్యునాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.

**4. రోజుకు ఒక అరటిపండు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– జీర్ణక్రియకు తోడ్పడుతుంది, ఎసిడిటీని తగ్గిస్తుంది మరియు ప్రేగులకు ఉపశమనం కలిగిస్తుంది.

**5. రోజుకు ఒక అంజీర్ పండు ఎండోక్రినాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది మరియు హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది.

**6. రోజుకు ఒక ఖర్జూరం హెమటాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– ఐరన్ అధికంగా ఉంటుంది, రక్తహీనత మరియు అలసటను నివారించడంలో సహాయపడుతుంది.

**7. రోజుకు ఒక దానిమ్మ పండు కార్డియాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

– గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు రక్తపోటును తగ్గిస్తుంది.

**8. రోజుకు ఒక పిస్తా తింటే యూరాలజిస్ట్ అవసరం ఉండదు**

– మూత్రపిండాల పనితీరుకు మద్దతు ఇస్తుంది మరియు మూత్రాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**9. రోజుకు గుప్పెడు బాదం పప్పులు తింటే చర్మవ్యాధి నిపుణుడి అవసరం ఉండదు**

– విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, చర్మ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది మరియు పొడిబారడాన్ని నివారిస్తుంది.

**10. రోజుకు ఒక బొప్పాయి తింటే కాలేయ నిపుణుడి అవసరం ఉండదు**

– కాలేయ నిర్విషీకరణకు మద్దతు ఇస్తుంది మరియు జీర్ణక్రియ, కొవ్వు జీవక్రియకు సహాయపడుతుంది.

### మామిడి పండ్లు ఇలా తింటే

## ఆస్పత్రికి పరుగెత్తాల్సిందే..



వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు.. వేసవి ప్రారంభమైంది. పండ్ల రారాజు మామిడి. వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు చేయవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మామిడి పండ్లు తినడం ప్రమాదకరం. మామిడి పండ్లను అధికంగా తినడం వల్ల లేదా తప్పుడు సమయంలో తినడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో ఇక్కడ తెలుసుకుందాం.. మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటే మామిడి పండ్లు కాస్త మితంగా తినాలి. మామిడి పండ్లలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు మామిడి పండు సుమారు 150 నుంచి 200 కేలరీలను అందిస్తుంది. దీనివల్ల బరువు పెరగవచ్చు. మామిడి పండ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మంచిదని భావిస్తారు. అయితే, మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల విరేచనాలు లేదా గ్యాస్ రావచ్చు. తరచుగా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారు మామిడి పండ్లను పరిమితంగా తినాలి. మామిడి తొక్క లేదా దానిలోని కొన్ని పదార్థాల వల్ల కొంతమందికి చర్మం దురద, దద్దుర్లు, కళ్ళు ఎర్రబడటం వంటి అలెర్జీ ప్రతిచర్యలు కలుగుతాయి. అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలి. మామిడిని అధికంగా తినడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగవచ్చు. దీనివల్ల కీళ్లనొప్పులతో బాధపడే రోగులలో నొప్పి పెరగవచ్చు. మామిడి పండ్లను తినడానికి ముందు కనీసం 1–2 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. దీనివల్ల వాటిలోని రసాయనక ప్రతిచర్యలు తగ్గుతాయి. రాత్రి పడుకునే ముందు మామిడి పండ్లు తినడం మానుకోవాలి. ఎందుకంటే దీనివల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మామిడి పండ్లలో తగినంత సహజ చక్కెర ఉంటుంది కాబట్టి వీటిని తినేటప్పుడు వాటికి చక్కెర కలపడం అంత మంచిదికాదు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు ఒక మధ్యస్థ పరిమాణంలో ఉన్న మామిడి పండు తింటే సరిపోతుంది. ఒకవేళ మీరు మామిడి పండ్ల ముక్కలు తింటుంటే రోజుకు ఒక చిన్న గిన్నెడు మామిడి పండ్లు తింటే సరిపోతాయి.

# చెరువుల పూడిక తీతతో భూగర్భ జలాల పెంపు : కలెక్టర్ కీర్తి చేకూరి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** జలధార కార్యక్రమం ద్వారా చెరువులలో పూడిక తీత పనులను చేపట్టి,100 రోజుల కార్యాచరణ పూర్తి చేసి భూగర్భ జలాల స్థాయిని పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.సోమవారం మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో "జలధార" కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణతో పాటు కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాల సగటుస్థాయి 7-8 మీటర్లు ఉండగా, గోదావరి జిల్లాలో సుమారు 21 మీటర్ల లోతులో ఉందన్నారు. జిల్లాలో మెరక ప్రాంతాలు, సాఫ్ట్ సోయిల్ భూములు అధికంగా ఉండడం వల్ల భూగర్భ జలాలు దిగజారు తున్నాయ న్నారు.భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వాటిని పైకి తీయడానికి భారీగా విద్యుత్ వినియోగం అవుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5000 కోట్ల వరకు ఖర్చు అవుతోందన్నారు. చెరువుల పూడిక తీత ద్వారా భూగర్భ జలాలను కాపాడగలిగితే



విద్యుత్ ఖర్చును తగ్గించవచ్చు అన్నారు. చెరువుల పూడిక తీత ద్వారా కనీసం ఒక మీటరు మేర భూగర్భ జలాల స్థాయి పెరిగినా రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందన్నారు. ఒక చెరువు నుంచి మరొక చెరువుకు నీరు చేరేలా చైన్ లింక్ వ్యవస్థ, కాలువల మరమ్మత్తులు, కేస్ కట్స్, గట్ల బలోపేతం వంటి అంశాలపై ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. వర్షాలు వచ్చినా నిండని చెరువులను గుర్తించి, వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసేందుకు స్థానికుల అనుభవాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. శాసనసభ్యులు బత్తుల మాట్లాడుతూ నీటి భద్రత అత్యంత ప్రాధాన్యత అంశమని,భూగర్భ జలాలు తగ్గిపోవడం ఆందోళనకర మన్నారు.వర్షాకాలంలో వచ్చే నీటిని సక్రమంగా వినియోగించుకుంటే భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో సాంకేతిక కారణాల వల్ల హాజరు నమోదు కావడం లేదన్నారు. శ్రీరంగపట్నం గ్రామంలో బురద కాలువ సమస్యను పరిష్కరించాలని, సురంపాలెం-ఉసురువల్లి రిజర్వాయర్ ముందస్తు హెచ్చరికలు లేకుండా నీటిని విడుదల చేయడం వల్ల ముంపు సమస్యలు వస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ఎస్ఈ జి శ్రీనివాసరావు, ఆర్డిఓఆర్ శివ రాముడు, అగ్రికల్చర్ ఏడి శ్రీనివాస్, తహసీల్దార్ సుగుణ,ఎంపీడీఓ అశోక్ కుమార్,ఇరిగేషన్ ఏఈ జగదీశ్,సి ఐ సత్యనారాయణ మూర్తి, మద్దాల రమణ,స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, సాగు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపి కబడ్డీ టీం కెప్టెన్‌గా రాజమండ్రి క్రీడాకారుడు దుర్గారావు

## - అభినందించిన స్వామి వివేకానంద మెమోరీ స్పోర్ట్స్ క్లబ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 72వ నేషనల్ కబడ్డీ పోటీలకు ఆంధ్ర కబడ్డీ జట్టు కెప్టెన్గా రాజమండ్రికి చెందిన పిట్ట దుర్గారావు ఎన్నికయ్యారు ఈ సందర్భంగా శ్రీ స్వామి వివేకానంద మొబైల్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణమ్మపేటలోని స్వామి వివేకానంద మెమొరీ స్పోర్ట్స్ క్లబ్లో అభినందన సత్కార సభ జరిగింది. స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ క్రీడాకారులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, కబడ్డీ క్రీడాకారులు సన్మానించారు. సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడ కూడా ఒక భాగమని అన్నారు.స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లిబాబు మాట్లాడుతూ దుర్గారావు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని, రాజమండ్రి వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ కు మంచి పేరు తేవాలని ప్రశంసించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చీర గంగాధరం మాట్లాడుతూ శ్రీ స్వామి వివేకానంద మెమోరీ స్పోర్ట్స్ లో రాజమండ్రిలో కబాడీకి మంచి పేరున్న సంస్థని, ఈ సంస్థలో దుర్గారావు మంచి ప్రతిభ కనబరిచినందుకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షులు నాగరాజు, అలాగే ఎస్ ఎస్ వి ఎం స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబాడీ క్రీడాకారులు వి.శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, కే సత్తిబాబు, ఎస్.వీరబాబు, బి.ఏలియా, కె.వీర్రాజు, ఎస్.కుమార్, సురేష్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారని బురిడి త్రిమూర్తులు తెలిపారు.

# సీతానగరం మండలంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానికులు,విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ జీవితమే ఒక ప్రేరణాత్మక ఉదాహరణ అని,సమాజానికి చూపిన సేవలు అన్ని తరాల కోసం ఆదర్శమని పేర్కొ న్నారు. గ్రామస్థులు, కార్యకర్తలు కూడా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని జయంతి ఘట్టాన్ని మరింత స్మరణీయంగా మార్చారు.ఈ కార్యక్రమం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని గుర్తించడమే కాక, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.

నియోజకవర్గంలో

# వైసీపీకి ఎదురు దెబ్బ : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని దోసకాయల పల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలను జనసేన పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించామని శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సోమవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో పలువురు వైకాపా నాయకులకు, శాసనసభ్యులు బత్తుల జనసేన కండువా వేసి సాధనంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, పాలనా దక్షతకు ఆకర్షితులై, రాజానగరం నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో వీరంతా జనసేన తీర్థం పుచ్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యం శ్రీనివాస్‌కు విద్యా భూషణ్ పురస్కారం

## శ్రీనివాస్‌కు పలువురు అభినందనలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ షిరిడి సాయి విద్యా సంస్థల ఛైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ సత్యం శ్రీనివాస్ "విద్యాభూషణ్ "పురస్కారాన్ని గుంటూరు మదర్ థెరీసా భవన్ లో అనిరా చారిటబుల్ ట్రస్ట్, రాజమండ్రి ఎడ్యుకేషన్ స్పెషల్ సంయుక్త ఆధ్వర్యంలో అందజేసి ఘనంగా సత్కరించారు. ఆదర్శ గురువులకు ఉగాది పురస్కారోత్సవం సందర్భంగా ప్రముఖుల చేతులమీదుగా శ్రీనివాస్ విద్యాభూషణ్ పురస్కారం అందుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ షిరిడి సాయి స్కూల్, శీలధి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్, ఇంచార్జ్‌స్, ఫ్యాకల్టీ అభినందనలు తెలిపారు. అవార్డు కు ప్రోత్సహించిన గుంటూరు అనిరా చారిటబుల్ ట్రస్ట్ కృష్ణారావు, ఎడ్యుకేషనల్ స్పెషల్ అధినేత రాజా రమేష్ లకు మేనేజ్మెంట్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ను పలు విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు అభినందించారు.

# ఆయుష్మాన్ వయో వందన కార్డులకు వైద్య సదుపాయాలు అందించాలి

## - పిజిఆర్ఎస్‌లో జనతావారధి సమస్యలను విన్నవించిన బిజెపి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆయుష్మాన్ వయో వందన కార్డులకువైద్య సదుపాయాలు అందించాలని బీజేపీ జనతా వారధి జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణంరాజు కో కన్వీనర్ యానాపు ఏసు, స్వామి సూర్యకిరణ్, మద్దిపట్ల రజిని. తదితరులు జిల్లా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేసారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఉద్దేశించిన జనతా వారధి కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' (పిజిఆర్ ఎస్) అలాగే రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో సోమవారం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం 70 సంవత్సరాలు పైబడిన వారికి సంవత్సరానికి 5 లక్షల వరకు ఆరోగ్య భీమా కల్పించే ఆయుష్మాన్ వయో వందన కార్డులను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా అంగీకరించేలా తగు ఆదేశాలు జారీ చేయాలని వృద్ధుల సంక్షేమంపై ఆలోచన చేయాలని వినతి పత్రంలో కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని జీవో నెం 49/02.04.2025 ప్రకారం ఎబిపిఎమ్ జెఏవై కుటుంబాలకు ఇతర కుటుంబాలకు అందించేలా నిర్ణయించిందని, కొన్ని జిల్లాలలో సీనియర్ సిటిజన్ కార్డులను జారీ చేసారని వారు గుర్తుచేశారు. అయినా సరే, వాటికి ప్రాధాన్యతలభించడం లేదని వార్పు ప్రస్తావించారు. అందుకే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తద్వారా వృద్ధ పౌరుల గౌరవం ఆరోగ్యం భద్రత కల్పించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్డులను నిరాకరించే సంస్థలపై తగిన చర్యలు తీసుకునే విధంగా మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారులు నియమించి,వృద్ధులకు సకాలంలో సేవలు అందేలా పర్యవేక్షణ చేయాలని కోరారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పెరుగుతున్న వృద్ధాశ్రమాలపై నిఘా పెంచాలని, అవసరమైన కుటంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించే వ్యవస్థఉండేలా చూడాలని కోరారు. . కొటికలపూడి వెంకటేశ్వర రావు, నాగులపల్లి వీరబాబు, వట్టికూటి వెంకట రమణ, తాళాబత్తుల భవానీ భాస్కర్.బొప్పన లోవరాజు, మల్లు వలస రాంబాబు.నాగల శివకుమార్,పి.కమల కుమారి,వై.రోహిణి బాల తదితర బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పులవర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ విద్యార్థులు

# ఐదుగురికి ఉద్యోగాలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పులవర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా చదువుకున్న పేద విద్యార్థులు ఐదుగురికి ఉద్యోగంలో వచ్చినవని వారి వివనములు ఈ విధంగా 1కుడిపూడి గణపతి, పొడగట్లపల్లి. 2గుజ్జు మౌనిక, రాజమండ్రి. 3కొల్లి దుర్గాప్రసాద్.ఈ ముగ్గురు సంస్కృతకోర్స్ సంస్కృత విద్యాపీఠం తిరుపతిలో చదివారు. ఇంటర్, డిగ్రీ, ఎంఏ బిఈడి, ఎంఈడి, వరకు చదివించడం జరిగిందని పీహెచ్డీ చేస్తుండగా టీచర్ పోస్ట్ లు వచ్చాయిఅని గణపతి జెడ్ పి హెచ్ స్కూల్ పామర్రు లో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ లోను, మౌనిక అచ్యుతపురం ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ టీజీపీసంస్కృత, కొల్లి దుర్గాప్రసాద్ కర్నూల్‌ారా రెసిడెన్సీయల్ స్కూల్ లో టీజీపీ సంస్కృత పోస్ట్ లోను జాయిన్ అయ్యారు అని 4 విద్యార్థినిపులవర్తి రేణుక, వెదిరేశ్వరం. ఈ అమ్మాయి ని ఇంటర్, బీటెక్ చదివించామని ఈమె ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ సూరంపాలెం లో 4వ సం. చదువుచున్నది. ఆమెకు అమెజాన్ లో జాబ్ వచ్చింది. రూ.1,10,000. జీతం. ఈ మధ్యనే జాయిన్ అయినది (5)అంకాళ అత్యూష, రావులపాలెం. ఈమె బివిసి ఓడాలరేవులో బీటెక్ చదివింది. ఈమె ఢిల్లీ టిసిఎస్ చెన్నైలో జాబ్‌లో జాయిన్ అయింది. ఈ విషయాలు అన్నియు ట్రస్ట్ అధ్యక్షులు పులవర్తి గోపాల కృష్ణ మూర్తి తెలియజేసారు. ఈ 5గురు పేద విద్యార్థులకు ఉద్యోగం రావడం నాకు చాలా ఆనందంగా ఉన్నది. ఈ 5కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని ట్రస్ట్ అధ్యక్షులు గోపాల కృష్ణ మూర్తి సంతోషంతో ఈ ఐదుగురికి అభినందనలు తెలియజేశారు.

# పార్టీ అధ్యక్షులు మాధవ్ ఆదేశాలతో మన ఊరు - మన జెండా

## అది వారి వ్యక్తిగత జెండా : అడపా సుధీర్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో మన ఊరు -మన జెండా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కోరుకొండ భాజపా మండల కన్వీనర్ అడపా సుధీర్ అన్నారు. సోమవారం భాజపా 47వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధి పథంలో శర వేగంగా దూసుకుపోతుందన్నారు. భారతదేశాన్ని నరేంద్ర మోడీ అగ్రదేశాల సరసన చేర్చడానికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా, మూడు మార్లు ప్రధానమంత్రిగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ఎక్కడ అవినీతి మరక అంటని ఏకైక వ్యక్తి తమ నేత మోడీ అన్నారు. మండలంలో తనకు తెలియకుండా కొద్దిమంది వ్యక్తులు పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, అది వారి వ్యక్తిగతమని, పార్టీకి ఎటువంటి ప్రమేయం లేదన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

# ప్రాణాలు పోతున్నాయి.. గుంత పూడ్చండి మహా ప్రభో..

## రహదారిపై ఏర్పడిన భారీ గుంతను పూడ్చాలని వినూత్న నిరసన

## అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేసిన ఎంబిసి సంఘం అధ్యక్షులు యాట్ల



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులకు ప్రాణాంతకంగా మారినా పట్టని అధికారుల తీరుపై రామచంద్రపురం నియోజకవర్గ ఎంబీసీ సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం శివారులో గల కబేళా దగ్గర రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంత కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారు. ఈ విషయంపై నియోజకవర్గం ఎం.బి.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు వినూత్నంగా నిరసన చేపట్టి, "రోడ్డు మీద గుంతలు పూడ్చండి - ప్రజల ప్రాణాలు కాపాడండి" ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు దగ్గరికి వచ్చే వరకు గుంత కనిపించకపోవడంతో అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తోందని, దీంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పత్రికల ద్వారా ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ నిరసనకు స్థానిక వాహనదారులు మద్దతు తెలుపుతూ, వెంటనే గుంత పూడ్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదాలకు కారణమవుతున్న ఈ గుంతను తక్షణమే పూడ్చి ప్రజల ప్రాణాలను రక్షించాలని అధికారులను కోరుతున్నారు.

# పలువురిని పరామర్శించిన జక్కంపూడి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్ఆ ర్సిపి నాయకుల కుటుంబ సభ్యులను, అనారోగ్యంతో ఉన్న పలువురు నాయకులు, కార్యకర్తలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా పరామర్శించారు. వంగలపూడి గ్రామంలో ఇటీవల మరణించిన కాజా పార్వతి కుటుంబాన్ని, పురుషోత్తపట్నం గ్రామంలో వెంపాటి రాములు కుటుంబాన్ని, రామచంద్రపురంలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన పిర్ల పోశియ్య కుటుంబ సభ్యులను, సింగవరంలో ఇటీవల మృతి చెందిన కట్టా దుర్గ,పురం శెట్టి సత్యనారాయణ కుటుంబాలను, సీతానగరానికి చెందిన నాగులపల్లి వెంకట్రావు కుటుంబాన్ని, మహిపాల్ దౌడబ్బాయి కుటుంబాన్ని, కొండేపూడిలో మద్ది రెడ్డి వీర సత్యం కుటుంబాన్ని, రఘుదేవపురంలో కోట శ్రీనివాస్ కుటుంబాన్ని రాజా పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం సింగవరంలో అనారోగ్యంతో ఉన్న పులిదిండి నాగేశ్వరరావును, కొండేపూడిలో అనారోగ్యానికి గురైన కనుమూరు సీత, ముదునూరి సురేష్ రాజులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ముగ్గుళ్ళ గ్రామంలో పలువురు వైసిపి నాయకులను కార్యకర్తలను రాజా పరామర్శించారు.

# అంకితభావంతో చేసిన సేవలు మరువలేనివి

## ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రామలింగేశ్వరరావు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**


దేవాలయాల అభివృద్ధికి రాంబాబు చేసిన సేవలు అమోఘమైనవని, ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ అమలాపురం డివిజన్ రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. యాంద్ర రాంబాబు పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేరూరు గ్రూప్ దేవాలయాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా 43 సంవత్సరాల పాటు సేవలు అందించడం విశేషమని తెలిపారు. శ్రీ ముత్యాలమ్మ, శ్రీ రాజ్యలక్ష్మమ్మ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా రాంబాబు చేసిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. తన సేవా కాలమంతా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటూ విధులు నిర్వర్తించడం సాధారణ విషయం కాదని అన్నారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ, దేవస్థానంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తాను పనిచేసిన ప్రతి చోట అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాంబాబు దంపతులను కే. కార్తిక, గంగాధర్, ఎస్. మహేంద్ర, ఆర్. రామచంద్ర కుమార్‌తో పాటు మాజీ ఈవో బొక్క వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాంబాబు బంధువులు, అభిమానులు, దేవస్థానం ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ జనతా పార్టీ

# 46వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బిజెపి కొత్తపేట మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో బిజెపి 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం విచ్చేశారు. నాయకులు ముందుగా స్థానిక బోడి పాలెం వంతెన సెంటర్ వద్ద బిజెపి పార్టీ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాలూరి మాట్లాడుతూ దేశసేవ, దేశాభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసేవే లక్ష్యంగా ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు కోట్లాది భారతీయుల ఆశయాలకు ప్రతిబింబంగా నిలిచిందనీ సిద్ధాంతం సేవ, సమర్పణ అనే మార్గదర్శకాలతో ముందుకు సాగుతూ, వాజపేయి, అద్వానీ, నరేంద్ర మోడీలాంటి నాయకులతో పాటూ ఇంకా అనేక మంది కార్యకర్తలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ కృషి చేస్తున్నారన్నారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" అనే మహత్తర సంకల్పంతో గ్రామం నుంచి దేశం వరకు ప్రతి భారతీయుడి జీవితంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో అభివృద్ధి, పారదర్శకత, సుస్థిరతకు కట్టుబడి పనిచేస్తున్న పార్టీ బిజెపి అనీ,నేడు భారతీయ జనతా పార్టీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ స్థాపకులు, నాయకులకు.అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు హృదయ పూర్వకంగా ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమంలో కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొలకోటి వెంకటేశ్వరరావు, బిజెపి యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, బిజెపి సీనియర్ నాయకులు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ, కముజు శివ, అన్యం సత్యనారాయణ, కిసాన్ మోర్చ నాయకులు ఉద్దరాజు ప్రసాదరాజు, కోటిపల్లి దామోదర్, యువమోర్చ మండల అధ్యక్షుడు వలపశెట్టి కిరణ్, మైనారిటీ మోర్చ మండల అధ్యక్షుడు అజ్జరపు సత్యనారాయణ, ముఖేష్ మరియు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

### అంబాజీపేట మండల యుపిఎఫ్ అధ్యక్షులుగా

## డాక్టర్ జె.విక్టర్ కుమార్ ఎన్నిక



అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ : అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపిఎఫ్) అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ జల్లి విక్టర్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుపిఎఫ్ తొలి సర్వసభ్య సమావేశం స్థానిక కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరంలో సోమవారం పాస్టర్ కె.తిమోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి చర్చి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అలాగే పాస్టర్లు అందరూ పరస్పరం సహోదర భావంతో ఒకరినొకరు ప్రేమించుకుంటూ సంఘ ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ జల్లి విక్టర్ కుమారును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విక్టర్ కుమార్ మాట్లాడుతూ యుపిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం నుంచి అధ్యక్షునిగా ఎన్నికైనందుకున అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యుపిఎఫ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బిషప్ జార్జి పాఫప్, బెతేస్త ప్రేయర్ టీం వ్యవస్థాపకులు రెవరెండ్ పి. రత్నం రాజు, పాస్టర్ కె. మోడీ, పాస్టర్ ఆర్. నరసరాజు, సిహెచ్ సుధాకర్, పాస్టర్ యేసు రత్నం, పాస్టర్ కృపారావు పాస్టర్ కృష్ణపర్, తదితరులు పాల్గొన్నారు.

## అంబాజీపేట హెడ్మాస్టర్‌ను సస్పెండ్ చేయాలి



అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కలెక్టరేట్ నందు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అంబాజీపేట హెడ్మాస్టర్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ డాక్టర్ రవిరాల మహేష్ కుమార్‌కి సోమవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. శనివారం రోజున అంబాజీపేటలో ఉన్నటువంటి జడ్పీ బాయ్స్ హై స్కూల్‌లో హెడ్మాస్టర్ సాయిరాం విద్యార్థుల చేత గుంట తవ్వించే పనిచేశారు. గుంట తవ్వుతూ ఉండగా విద్యార్థి మణికంఠకు మధ్య వేలు గునపం దిగడంతో బలంగా గాయమైం . దాదాపు వేలు తీసే పరిస్థితి ఏర్పడింది. ఏలుకు గుణపం దిగినా కూడా కనీసం కనికరం లేకుండా ఉదయం 11:30 కు జరిగితే మూడున్నర వరకు ఎటువంటి చికిత్స లేకుండా అంబాజీపేటలో ఉన్నటువంటి హాస్పిటల్‌కి వెళ్లి ప్రాథమిక చికిత్స చేయడం జరిగింది అక్కడ డాక్టర్ వెంటనే మెరుగైన చికిత్స చూపించాలి అని చెప్పి చెప్పడంతో వెంటనే అమలాపురం తీసుకొచ్చి అనిల్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ జాయిన్ చేపించి వెళ్లిపోవడం జరిగింది. కనీసం విద్యార్థిని పట్టించుకోకపోవడం కాక తల్లిదండ్రులతో కూడా సరిగ్గా మాట్లాడటం చాలా బాధాకరం. పాఠశాల ఆవరణంలో విద్యార్థుల చేత పని చేయించకూడదు అనేది చాలా సస్పష్టంగా ఉన్నది. గతంలో ఇలా పని చేపిస్తేన్నతాధికారులు ఎంతోమంది ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసిన దాఖలు చాలా ఉన్నాయి కనుక వెంటనే కలెక్టర్ గారు దృష్టి పెట్టి విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి హెచ్ ఎం సాయిరాం గారిని సస్పెండ్ చేయాలని ఆర్ ఎస్ యు డిమాండ్ చేస్తుంది లేని పక్షంలో తీవ్రస్థాయి ఉద్యమం ఉంటుందని తెలిపారు.

## ఇరువురు విలేకరులపై కేసు నమోదు



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : తాను పనిచేస్తున్న ప్రదేశంలోకి అనుమతి లేకుండా ప్రవేశించి, డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసిన ఇరువురు విలేకర్లపై కేసు నమోదు చేసినట్లు కాట్రేనికోన ఎస్.ఐ అవినాష్ తెలిపారు. ఇందుకు సంబందించిన వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం గచ్చకాయల పోరలో వేదాంత కంపెనీకి చెందిన సైటును లంకలపల్లి సతీష్ గడిచిన మార్చి 17 న ఫిల్లింగ్ చేస్తుండగా ముమ్మిడివరం మండలం అయినాపురంకు చెందిన పెయ్యల వెంకటరమణ అలియాస్ సిద్దు, ఐ.పోలవరం మండలం కేసనకుర్రు గ్రామానికి చెందిన మోర్త వీర సూర్జం అనే ఇరువురు విలేకరులు గచ్చకాయలపోర లోని వేదాంత ఫిల్లింగ్ సైట్ కి వెళ్లారని,తమకు డబ్బులు ఇవ్వకపోతే సైట్ ఫిల్లింగ్ లో అక్రమాలు జరుగుతున్నాయంటూ వార్తలు రాస్తామని సతీష్ ను బెదిరించారన్నారు.ఈ విషయమై రూ.22 వేలను మొబైల్ బ్యాంకింగ్ ద్వారా మోర్త సూర్జం కు వేసినట్టు లంకలపల్లి సతీష్ తమ కిచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడని ఎస్.ఐ తెలిపారు.ఈ మేరకు కేసును విచారించిన అనంతరం పిర్యాదు దారుని ఆరోపణలు రుజువుకావటంతో ఎస్ఐ అవినాష్ ఇరువురు విలేకరులపై 329(3), 308(2),351(3)రెడ్ విత్ 3(5)బిఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. కాగా విచారణ ఇంకా కొనసాగుతుందని మరి కొంతమంది ఈ బెదిరింపులు వెనకాల ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

### ప్రభుత్వానికి ఇంటి వద్ద జై అమరావతి ముగ్గు వేసి

## అభినందనలు తెలుపుతున్న మహిళలు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : అమరావతి రాజధాని ఆంధ్రుల కళ అమరావతి శాశ్వత రాజధానిగా చట్ట భద్రత కల్పించిన కూటమి ప్రభుత్వానికి ఇంటి వద్ద జై అమరావతి ముగ్గు వేసి అభినందనలు తెలుపుతున్న మహిళలు అమరావతి శాశ్వత రాజధానిగా చట్టభద్రత కల్పించిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ ఆంధ్ర ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ఆంధ్రుల కళ నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు ర్యాలీలు జరిపారు. జ్యోతులు వెలిగించారు. జై అమరావతి అంటూ ముగ్గులు వేసి మహిళలు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.ప్రజల ఆమోదయోగ్యానికి వ్యతిరేకంగా మూడు రాజధానులు చేస్తాము అంటూ గత ప్రభుత్వ పరిపాలనలో ప్రకటనలను వెలువడినప్పుడు ఆంధ్ర ప్రజలు గట్టిగా ప్రతిఘటించారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర ప్రజల మనోభావాలను గుర్తించి అమరావతి రాజధానిగా కూటమి ప్రభుత్వం శాశ్వత రాజధానిగా చట్టభద్రత కల్పించడంతో ఆంధ్రులు ఆనందంలో ఉన్నారు. ఆనందాన్ని వ్యక్తపరుస్తూ సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిని & వర్ధిని తన ఇంటి వద్ద జై అమరావతి ముగ్గు వేసి తమ సంతోషాన్ని తెలియపరిచారు. కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు జై అమరావతి అంటూ వేసిన ముగ్గును కెమెరాలో బంధించి వాట్సప్ లో ఆయనకి పంపించారు.

# 66 మందికి రూ.30.73 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### అనారోగ్య బాధితులకు అండగా సీఎం సహాయ నిధి - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 66 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.30.73 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు. అనారో గ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు చందమామ వాసు, రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కె గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, గరికపాటి సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్లు ఖండవల్లి శ్రీనివాసరావు, నారపురెడ్డి బలరాం,వళ్ళు అర్జునరావు, అన్యం శ్రీరామ్, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, పలివెల రాజు,కూటమి పార్టీ నాయకులు లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్‌లో అదరగొడుతున్న కోనసీమ కుర్రోడు

### కుటుంబ పరిస్థితులకు ఎదురీదుతూ మెడల్స్



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : సాధిస్తూ సాధారణంగా వివిధ క్రీడల్లో రాణించేవారు ఆయా క్రీడల్లో వారు ఎదగాలి అన్న తపనతో కష్టపడుతుంటారు. కానీ తాను రాణించే క్రీడలో ఎంతోమంది ప్రగతి సాధించాలని తద్వారా ప్రమాదాలు ఎదుర్కోవాలని ఒక యువకుడు చేసిన ఆలోచన అద్భుతం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన గుత్తుల నరసింహ. తండ్రి చనిపోయాడు. తల్లి కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకుంది. తనను చెల్లిను పెంచడానికి తల్లి ఎంతో కృషి చేసిందని నరసింహ పేర్కొన్నాడు. ఇప్పటికీ తల్లి డబ్బులు తెమ్మని డబ్బులు ఏవని అడగదని నువ్వు చేసే ప్రయత్నంలో విజయం సాధించి నాయనా అంటుందని ఆ దీవెనలే తాను నమ్ముకున్న వృత్తిలో నిలబెట్టేయని ఎంతో సంతోషంతో నరసింహ చెబుతున్నాడు. సాధించిన విజయాలుఈనెల ఐదున జగ్గయ్యపేటలో జరిగిన స్విమ్మింగ్ 200,100మీటర్ల ఫ్రీ స్టైల్‌లో మొదటి స్థానంలో విజయం సాధించారు. బెస్ట్ స్ట్రోక్ 50 మీటర్లు లో మూడో స్థానం సాధించాడు. అక్కడ ఎమ్మెల్యే శ్రీరామ తాతయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ టీం మేనేజర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సొంతంగా స్విమ్మింగ్లో శిక్షణతన స్నేహితుడి తమ్ముడు మరో కొంతమంది 2015లో నదిలో మునిగిపోయారు. వారి కుటుంబాల్లో తీవ్ర దుఃఖం మిగిలింది. ఈత రాకపోవడం మూలంగా విలువైన ప్రాణాలు కోల్పోతున్నాయని గ్రహించిన నరసింహ తాను తొలుత స్విమ్మింగ్ నేర్చుకున్నాడు. తర్వాత హైదరాబాదులో సొంతంగా స్విమ్మింగ్ ఇన్స్టిట్యూట్ స్టార్ట్ చేశాడు. వేల మంది ఔత్సాహికులకు స్విమ్మింగ్ నేర్పిస్తున్నాడు. అన్ని క్రీడలు కంటే భిన్నంగా స్విమ్మింగ్ క్రీడా ప్రమాదం నుండి రక్షిస్తుందని పలువురిని రక్షించ డానికి వీలుపడుతుందని అందుకే ఇటువైపు మొగ్గు చూపానని అభిప్రాయపడ్డాడు. ప్రభుత్వ సహాయం అవసరంతాను తలపెట్టిన ఈ యజ్ఞానికి ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా అవసరమని నరసింహ అన్నాడు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జిల్లా మండల గ్రామీణ స్థాయిలో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో పాటు ఔత్సాహికులు కూడా నేర్పించాలని అన్నాడు. ప్రతి ఏటా నదులు, సముద్రాలు, ఇతర నీటి ప్రవాహాల్లో పడి ఎంతోమంది చనిపోతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్విమ్మింగ్ ప్రమాదాన్ని ఎదుర్కోవడంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రంలో స్విమ్మింగ్ ఇన్స్టిట్యూట్ను ఏర్పాటు చేసి తద్వారా స్విమ్మర్స్ ను తయారు చేస్తానన్నారు. యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు స్విమ్మింగ్ కోచ్ నాని పేరుతో యూట్యూబ్ ఛానల్ కూడా ఏర్పాటు చేశాడు. ఈ యూట్యూబ్ ఛానల్ తెలుగులోనే మొట్టమొదటిది. తెలుగు వారు ఎక్కడున్నా సులువుగా అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. నాని స్విమ్మింగ్ సమ్మర్ క్యాంప్స్ వెబ్ సైట్ ( ఇది ఫైవ్ స్టార్ రివ్యూతో నడుస్తుంది )ద్వారా హైదరాబాద్ మహానగరం హైటెక్ సిటీలో టాప్ వన్ ప్లేస్ లో స్విమ్మింగ్ నేర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి స్విమ్మింగ్ ఇన్స్ట్రక్టర్గా 2023లో సర్టిఫికెట్ కూడా సాధించాడు.

# మే 15 మహా పాదయాత్రను విజయవంతం చేయండి

### హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడదాం : జేఏసీ ఛైర్మన్ వెంకన్న బాబు



కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జేఏసీ ఛైర్మన్ లిసిహెచ్. వెంకన్న బాబు, పిటిఐ నాయకుడు రామకృష్ణ సోమవారం కె.గంగవరం మండలంలో పర్యటించారు. మే 15న నిర్వహించ తలపెట్టిన భారీ పాదయాత్ర సన్నాహకాల్లో భాగంగా సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు వెంకన్న బాబు మాట్లాడుతూ కనీస వేతనం కూడా లేకుండా సిబ్బంది సుదీర్ఘ కాలంగా వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి మారాలంటే ఉద్యోగులందరూ ఏకతాటిపైకి రావాలని సూచించారు. మే 15న చేపట్టే పాదయాత్ర కేవలం ఒక యాత్ర మాత్రమే కాదని, అది హక్కుల సాధన కోసం చేసే యుద్ధమని ప్రకటించారు. ప్రతి విభాగ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పిటిఐ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.గంగవరం మండలానికి చెందిన సీఆర్పీలు, మండల అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్స్, మెసెంజర్లు మరియు ఇతర సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొని పాదయాత్రకు పూర్తి మద్దతు ప్రకటించారు.

### 24 గంటల్లోపే రైతు ఖాతాకు నిధులు

# ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో జమ చేస్తుంది

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : ఆత్రేయపురం అన్నపూర్ణగా పేరుగాంచిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గడ్డపై, రైతు కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో 194 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రప్రదమంగా జిల్లా వ్యాప్తంగా ఆత్రేయ పురం గ్రామం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ డం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు స్థానిక శాసనసభ్యులు లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారం భించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్ర ప్రథమంగా ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని ప్రారంభించు కోవడం మనందరికీ ఎంతో శుభప రిణామమన్నారు. అన్న పూర్ణగా పేరుగాంచిన మన కోనసీమ గడ్డపై, రైతు కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ సౌలభ్యం కల్పించిందన్నారు గతంలో రైతులు పండించిన పంట ను అమ్ముకోవడానికి దళారులపై ఆధారపడి మోసపోయేవారనీ. ప్రస్తుతం నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందే అవ కాశం కలిగిందన్నారు. మద్దతు ధరకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నేరుగా రైతు ఖాతాల్లో కే 24 గంటలలోపే జమ అవు తుందన్నారు. దీనివల్ల ప్రతి గింజకూ తగిన విలువ దక్కుతుం దన్నారు.ఈ కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన తేమ యం త్రాలు, తూకం మిషన్లు మరియు గన్నీ బ్యాగులను సిద్ధం చేయడం జరిగింద న్నారు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరుగుతాయన్నారు. స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు మాట్లాడుతూ రైతు సంక్షే మమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు పెద్దపీట వేస్తోందన్నారు రైతు రాజు కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ న్నారు కోనసీమలో పండే ప్రతి వరి గింజ రైతుకు లాభాన్ని చేకూర్చాలనీ ఆకాంక్షించారు రైతులంద రూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని, నాణ్యతా ప్రమా ణాలను పాటించి తమ ధాన్యాన్ని విక్రయించి ఆర్థికంగా బలోపేతం కావాలని అభిలాషించారు. ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ప్రసం గిస్తూ పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు పార దర్శక విధానాలను అవ లంబిస్తూ 24 గంటల్లోపే రైతు ఖాతాకు నిధులు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో జమ చేస్తుం దన్నారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు సంబం ధించి ఎటువంటి అసం తృప్తి లేదన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి లక్ష్మీనారాయ ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి శ్రీనివాస్ జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ ఉదయభాస్కర్ జిల్లా వ్యవసాయ అధికారి ఎంవి రామారావు స్థానిక ప్రజా ప్రతినిధులు నీటి సంఘ అధ్యక్షులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లి మంగాదేవికి ఎంపీ హరీష్ మాధుర్ ప్రత్యేక అభినందనలు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రావులపాలెంలో జరిగిన కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అమలాపురం పార్లమెంట్ ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఢిల్లీలో పార్లమెంట్ సెషన్స్ జరుగుతున్న సందర్భంగా హాజరు కాలేకపోయారు. నేడు పల్లి భీమారావు స్వగ్రాహానికి వానపల్లి విచ్చేసి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లి మంగాదేవికి ఎంపీ హరీష్ మాధుర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పల్లి భీమారావు మంగాదేవి దంపతులకు శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు చెల్లి అశోక్ కొత్తపేట టిడిపి నేతలు పోలబత్తుల సుబ్రహ్మణ్యం గనిశెట్టి వీరేష్ నూకల వీరన్న సిద్దబత్తుల బహుదూర్ అప్పారి శ్రీను అంబటి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా దర్బార్‌లో సమస్యలకు

## తక్షణ పరిష్కారం

### ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజాభిమానాన్ని చాటింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రికి తెలియజేశారు. ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగ పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు కోరుతూ మొత్తం 80 అర్జీలు అందాయి. ప్రతి వినతిపత్రాన్ని శ్రద్ధగా స్వీకరించిన మంత్రి, సమస్యలను అర్థం చేసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై ఎటువంటి ఆలస్యం సహించబోమని స్పష్టం చేస్తూ, పరిష్కారం దిశగా వేగంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం తన ప్రాథమిక బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు నమ్మకాన్ని కలిగించే వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.

### భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో

## మన ఊరు-మన జెండా కార్యక్రమం



ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ముమ్మిడివరం రూరల్ మండలం సిహెచ్ గున్నేపల్లి గ్రామంలో ఏప్రిల్ 6వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మన ఊరు మన జెండా కార్యక్రమం సందర్భంగా నూతనంగా నిర్మించిన జెండా స్తూపం ను భారతీయ జనతా పార్టీ జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థూపం పాలక్ గొలకోటివెంకటరెడ్డి. రాష్ట్రకౌన్సిల్ సభ్యులు మూర్తి రాజు మండలాధ్యక్షులు చప్పిడి దుర్గ మట్ట శివకుమార్ దంగుడు బియ్యం శ్రీనివాసరావు మట్టా సూరిబాబు కోటా సత్య ప్రసాద్ గాలి దేవర వెంకటరమణమూర్తి కొయ్యల దుర్గారావు గనిశెట్టి శ్రీనివాసరావు కొత్త లంక సురేష్ జన్నిపల్లి శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రమాద బాధితుడికి

## మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా

### రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత
### కోలుకునే వరకు ప్రతి నెలా సాయం అందిస్తామని హామీ



రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచారు. మానవత్వంతో స్పందించిన మంత్రి, బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి ధైర్యాన్ని నింపారు. వివరాల్లోకెళితే.. ద్రాక్షారామం గ్రామానికి చెందిన కుదురు శ్రావణ్ కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లు, ఒక చేయి విరగడంతో ప్రస్తుతం కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామచంద్రపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్, బాధితుడు పూర్తిగా కోలుకునే వరకు ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని గతంలోనే హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా, సోమవారం రెండవ నెలకు సంబంధించిన రూ.10 వేల నగదును బాధితుడి తల్లి జ్యోతికి మంత్రి అందజేశారు. కష్టకాలంలో మంత్రి స్పందించి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంపై బాధితుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### గోపాలపురం ఇండియన్ బ్యాంకులో

## కస్టమర్లకు కరెంటు కష్టాలు



రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం లో ఏకైక బ్యాంకు గా ఉన్న ఇండియన్ బ్యాంకు కస్టమర్లకు కరెంటు పోతే మరల ఎప్పుడు వస్తుందో మాకు తెలియదని కరెంటు వచ్చేవరకు సేవలు చేయలేమని జనరేటర్ సౌకర్యం లేదని రూరల్ ఏరియా బ్యాంకు కనుక ఈ ఇబ్బందులు ఉంటాయని బ్యాంక్ స్టాఫ్ కస్టమర్లకు ఈ విధంగా తెలియజేస్తున్నారు. భారతదేశం డిజిటల్ ఇండియా అవుతుంటే బ్యాంకింగ్ సర్వీసులు చాలా స్పీడ్ గా కస్టమర్లకు మంచి మంచి సర్వీసులు అందిస్తూ బ్యాంకులకు వచ్చి టైము పాడు చేసుకోకుండా సద్వినియోగపరచుకోండి అని ఏటీఎంలో పేటీఎంలో ఫోన్ పేలు వివిధ రకమైన సర్వీస్ అందించి తక్కువ సమయంలో ఎక్కువగా సర్వీస్ పొందేలా కస్టమర్లు ఇబ్బంది పడకుండా చూస్తుంటే మన ఇండియన్ బ్యాంకు వారు కరెంటు పేరు చెప్పి సర్వీసులు నిలిపివేసి కస్టమర్ల కాలాన్ని సమయాన్ని వృధా చేయడం ఎంతవరకు సమంజసమని ఇండియన్ బ్యాంకు గోపాలపురం కస్టమర్లు వాపోతున్నారు. ముఖ్యంగా మహిళలు డ్వాక్రా వాయిదాలు కట్టడానికి వచ్చి గంటలు గంటలు వేచి చూచే పరిస్థితి అన్ని సర్వీసులు బ్యాంకులకు అనుసంధానం చేయడం వల్ల గోపాలపురంలో ఒక్క బ్యాంకు అవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులు ఈ విషయాన్ని గ్రహించి రెండో బ్యాంకు గోపాలపురంకి తీసుకువచ్చేలా ప్రయత్నించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# కాకినాడ జిల్లాలో 32 రూర్బన్ పంచాయతీలు ఏర్పాటు

## రాష్ట్రంలో 359 రూర్బన్ పంచాయతీల ఏర్పాటు - మండలాలకు సోమవారం అందిన ఉత్తర్వులు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 10,000 కంటే ఎక్కువ జనాభా, పట్టణద లక్షణాలు ఉన్న గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా మార్చాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ రూర్బన్ పంచాయతీల ఏర్పాటు జరుగుతోంది. రూర్బన్ పంచాయతీల కూర్పులో మండల కేంద్రాలు, పెద్ద గ్రామ పంచాయతీలకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఈ పంచాయతీల్లో ఇంజనీరింగ్, ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ అనే నాలుగు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. ఇవి రోడ్లు, డ్రైనేజీ, వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షిస్తాయి. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన పంచాయతీల్లో గ్రామీణ ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను పట్టణ తరహాలో మెరుగు పరచడం, గ్రామీణ ప్రాంతాలను పట్టణాలతో అనుసంధానించడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధిశాఖ ముఖ్య ఉద్దేశం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్థాయి జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ జరిగి, పాలనలో సంస్కరణలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగా 24 ఏప్రిల్ 2026 నాటికి రాష్ట్రం మొత్తం మీద 359 కొత్త రూర్బన్




పంచాయతీలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికను రూపొందించి అమలు పరుస్తోంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు, చిత్తూరు వంటి జిల్లాల్లో రూర్బన్ పంచాయతీలు ఎక్కువగా ఏర్పాటు అవుతున్నాయి. గ్రామ పంచాయతీల పరిపాలనలో సంస్కరణలు, జనాభా, ఆదాయం మరియు భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా గ్రామ పంచాయతీల పునర్వర్గీకరణ ప్రకారం కాకినాడ జిల్లాలోని గ్రామ పంచాయతీలను మూడు వర్గాలుగా విభజిస్తూ, దాంతోపాటు రూర్బన్ గ్రామ పంచాయతీలుగా పునర్వర్గీకరణ చేస్తూ జి.ఓ.ఎం.ఎస్.నెం.29 తో 09-03-2026 తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 385 గ్రామ పంచాయితీల పరిధిలో 412 గ్రామాలు ఇమిడి ఉన్నాయి. ఐతే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న రూర్బన్ పంచాయతీల కూర్పులో కాకినాడలో జిల్లాలో కొత్తగా 32 రూర్బన్ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. గొల్లప్రోలు మండలం నుంచి చేబ్రోలు, దుర్గాడ, జగ్గంపేట మండలం నుంచి జగ్గంపేట, కాట్రావులపల్లె, కాజులూరు మండలం నుంచి కాజులూరు, కాకినాడ గ్రామీణ మండలం నుంచి చీడిగ, గంగనాపల్లి, ఇంద్రపాలెం, రమణయ్యపేట, సర్పవరం, సూర్యారావు పేట, తిమ్మాపురం, తూరంగి, వాకలపూడి, వలసపాకల, కరప మండలం నుంచి కరప, కిర్లంపూడి మండలం నుంచి జగపతి నగరం, పెదపూడి మండలం నుంచి జి.మామిడాడ, రామేశ్వరం, ప్రత్తిపాడు మండలం నుంచి ప్రతిపాడు, ధర్మవరం, సామర్లకోట మండలం నుంచి మాధవపట్నం, పనసపాడు, వేట్లపాలెం, శంఖవరం మండలం నుంచి అన్నవరం, కత్తిపూడి, తుని మండలం నుంచి తుని, ఎస్.అన్నవరం, తాళ్లరేవు మండలం నుంచి గాడిమొగ, కోరింగ, పి.మల్లవరం, ఉప్పాడ కొత్తపల్లి మండలం నుంచి ఉప్పాడ, ఏలేశ్వరం మండలం నుంచి లింగంపర్తి రూర్బన్ పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి.

# జనసేన ఉద్యమి సభ్యత్వాల నమోదు పొడిగింపు...!

## ఇప్పటికే 20 లక్షల సభ్యత్వాలు పూర్తి - నమోదు పొడిగింపు గడువు ప్రకటించని పార్టీ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభిస్తున్న నేపథ్యంలో వివిధ జిల్లాలు, నియోజకవర్గాల నుంచి వస్తున్న అభ్యర్థనలను పరిగణలోకి తీసుకుని పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరికొన్ని రోజుల పాటు పొడిగించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు మంగళగిరి నుంచి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుండి అందులోనూ ముఖ్యంగా యువత, వివిధ వర్గాల నుంచి విశేషమైన స్పందన లభించడం జనసేన పార్టీ పట్ల పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా పార్టీ పేర్కొంది. గత నెల రోజులుగా ఒక ఉద్యమంలా సాగుతున్న ఉద్యమి సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఇప్పటికే దాదాపు 20,000,00 మందికి పైగా ప్రజలు సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ విధంగా పార్టీ పట్ల, అధ్యక్షులు పవన్




కళ్యాణ్ పట్ల వారిలో ఉన్న విశ్వాసాన్ని చాటి చెప్పారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆసక్తి ఉన్నవారు సాంకేతిక కారణాలు, సమయాభావం, స్థానిక పరిస్థితుల వల్ల సభ్యత్వ నమోదు చేసుకోలేక పోయినట్లు పార్టీ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో అలాంటి ప్రతి ఒక్కరికీ మరో అవకాశం కల్పించాలని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశించారని పార్టీ వెల్లడించింది. రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు అందించే లక్ష్యంతో పని చేసే జనసేన పార్టీలో సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే ప్రతీ ఒక్కరినీ జనసేన పార్టీ కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నాము. కావున ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఇంకా సభ్యత్వం పొందని వారు మీ సమీపంలోని జనసేన సాధకులను సంప్రదించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మంగళగిరి నుంచి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 20,000,00 మందికి పైగా ప్రజలు సభ్యత్వాలను స్వీకరించిన తర్వాత కూడా జనసేన ఉద్యమి సభ్యత్వాల నమోదును ఇంకా ముందుకు పొడిగిస్తూ నిర్ణయాన్ని తీసుకున్న పార్టీ నమోదుకు గడువు కాలాన్ని మాత్రం ప్రకటించలేదు.

జిత్ మోహన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో

# డాక్టర్ సోమరాజు నాయుడుకు 'కళా సేవా మిత్ర' పురస్కార ప్రదానోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరానికి చెందిన అమ్మ ఫిజియోథెరపి హాస్పిటల్ వైద్యులు,నటుడు, గాయకుడు, రచయిత డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడును "కళా సేవా మిత్ర" బిరుదుతో సత్కరించే కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల 'జిత్ మోహన్ మిత్ర కళావేదిక'లో ఎంతో వైభవంగా జరిగింది. ఆర్కెస్ట్రా పితామహుడు, శ్రీపాద జిత్ మోహన్ మిత్ర మరియు వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగిన మిత్ర బృందం 23 వ వార్షికోత్సవం కార్యక్రమంలో,జిత్ మోహన్ మిత్ర సభ అధ్యక్షత వహిస్తూ,తనపేరుతొ ఏర్పాటు చేసిన మిత్ర బృందం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ, 23ఏళ్ళు పూర్తిచేసుకుంద న్నారు. ఈసందర్భంగా నటుడు,గాయకుడు రచయితగా 9 సంవత్సరాలుగా కళా సేవా రంగాల్లో డా.గిరజాల సోమరాజునాయుడు చేస్తున్న విశేష కృషిని గుర్తించి, ప్రోత్సాహిస్తూ ఈ అభినందన సత్కారం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా పివిఎస్ కృష్ణారావు, వి జగపతి రావు, బోడపాటి సీతారామారావు, జీమా అధ్యక్షుడు డి ఎస్ ఎస్ శ్రీనివాసరావు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, పిరాట్ల శ్రీహరి, రామకృష్ణ,తదితరులు పాల్గొని మాట్లాడుతూ గిరజాల సోమరాజు నాయుడు నటుడిగా, గాయకుడిగా, రచయితగా, వైద్యునిగా అందిస్తున్న సేవలు అద్వితీయమని పేర్కొన్నారు. నూజిళ్ల సూరిబాబు కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీపాద జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఎంతో బాధ్యతాయుతంగా ఉంటూనే, కళా రంగంపై ఉన్న మమకారంతో నటుడిగా, గాయకుడిగా మరియు రచయితగా సోమరాజు నాయుడు సాగిస్తున్న తొమ్మిదేళ్ల ప్రస్థానం ఎంతో అభినందనీయం" అని కొనియాడారు. పురస్కార గ్రహీత డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు మాట్లాడుతూ జిత్ మోహన్ మిత్ర అన్నివిధాలా తనను ప్రోత్సహించారని, వారి వలన ఎందరో ప్రముఖులతో పరిచయ భాగ్యం కల్గిందని, మిత్ర బృందం తనను సొంతబిడ్డగా తనను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పురస్కారం తనకు మరిన్ని కళాత్మక బాధ్యతలను పెంచిందని, భవిష్యత్తులో కూడా కళా రంగానికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. తన కళా సేవలను గుర్తించి, పెద్దల సమక్షంలో ఈ గౌరవాన్ని అందించిన నిర్వాహకులకు, హాజరైన సాహితీ, కళా రంగ ప్రముఖులకు మరియు మిత్ర బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన వివిధ సాహిత్య, స్వర, సంగీత, సాంస్కృతిక మరియు కళా రంగాల ప్రముఖులు,జీమా సంస్థ తరపున మహేష్ తేజ్, పిచ్చుక మహేష్ బాబు, రామసాయి, పవన్, రవి, సురేంద్ర, వి.శ్రీనివాస్, రవీంద్ర, చలం, గుడాల సూరిబాబు, సాన నరేంద్ర, గుమ్మడి రత్నరాజు, గుంటూరి శ్రీనివాసరావు, పోస్టల్ ప్రసాద్, బి.రామ్ మోహన్, కెవిపి మూర్తి, సామ్రాట్ అక్కినేని, కె.యన్.మూర్తి, స్వాతి హోటల్ సత్యనారాయణ జీవిఎస్ లక్ష్మి తులసి, బియస్ ఎన్ ఎల్ మూర్తి, సూర్య కుమారి, మూర్తి, సి.హెచ్.విశ్వనాథ్. మురుకుట్ల కృష్ణ , డా.హరి, సత్యకృష్ణ, రేవతి, వడ్డాది నాగేంద్ర, మంగళంపల్లి సోమయాజులు, ప్రసాద్, రిమ్మలపూడి రామ్, శ్రీ పాద శంకర రావు, బషీర్, కృత్తివెంటి ఫణి, బషీర్, సూర్య సిద్ధాంతి, షాజహాన్, సుదర్శన బాబు,ఉప్పు సుబ్రహ్మణ్యం, కె.వెంకటేశ్వర్లు,కృష్ణవేణి, అడబాల రామకృష్ణ, డా.గిరజాల చిన్నారామ్, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన వివిధ సాహిత్య, స్వర, సంగీత, సాంస్కృతిక మరియు కళా రంగాల ప్రముఖులు, సభ్యులు పాల్గొని డా.సోమరాజు నాయుడును ఆత్మీయంగా అభినందించారు. తొలుత డా వంక బాలకృష్ణ ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది.

# దళిత, బహుజనుల హక్కుల కోసం పోరాడిన సంస్కరణ యోధుడు

**-వైకాపా రూరల్ కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా**
**- నివాళులర్పించిన చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ**



**బొమ్మూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత, బహుజనుల హక్కుల కోసం పోరాడిన సంస్కరణ యోధుడు అని చెల్లుబోయిన వేణు అన్నారు.వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తూర్పు గోదావరి జిల్లా వై.సి.పి అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అధ్యక్షతన కీ"శే"బాబు జగజ్జివన్ రామ్ చిత్రపటానికి పూల మాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ జీవితాంతం దళిత,బహుజనుల హక్కుల కోసం సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన సమతామూర్తి దేశం గర్వించదగిన గొప్ప పాలనాదక్షులు,భారత దేశ తోలి ఉప ప్రధాని,బడుగు బలహీన వర్గల మరియు అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి,సంఘ సంస్కర్త, స్వతంత్ర సమర యోధులు, 27 సంవత్సరాలకే శాసనసభ్యులుగా గెలుపొందిన వ్యక్తి, అనంతరం 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా,ఎన్నో సేవలు అందించి,దేశ ప్రజల గుండెల్లో నిలిచి పోయిన మహా నాయకుడు అని 50 సంవత్సరాలు సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగుతూ దేశ ప్రజలకు సేవలందించి ఎన్నో సంస్కరణలు చేసిన మహోన్నత వ్యక్తి భారత దేశ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఆ మహనీయుడి ఆశయసాధనలో అట్టడుగు వర్గల అభ్యున్నతి కోసం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పునరశీకితంమవుతొందని అన్నారు ఆయన జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు లీగల్ సెల్ అధ్యక్షులు చింతపర్తి రాంబాబు,రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి అంగాడ సత్యప్రియ, చాప రాజా, ఓదూరి రాంకీ, పెనుమాక సునీల్, కొడమంచిలి కోటిబాబు, ఉంద్రజవరపు సూర్య, అరుగుల రమణ, ఎండీ హమీద్ బాషా, షేక్ ఇబ్రహీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో

# భూగర్భ జలాల వృద్ధి

**వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే ఆదిరెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని రాజ మహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. J.S.J.B-2.0 కార్యక్రమంలో భాగంగా నారాయణపురం వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను పూడ్చే కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భ జలాలది కీలక పాత్ర అని పేర్కొన్నారు. అందువల్ల వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎక్కడైతే వర్షపు నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుందో అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి సమీపంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని తెలిపారు. భవిష్యత్తులో నీటి కొరత సమస్యలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వాననీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలా చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం, నీటి వనరులు అందించిన వారమవుతామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలోనే ఇంటర్ చదివించాలి

**ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించిన కళాశాల అధ్యాపకులు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించి ప్రభుత్వం అందించే సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యను పొందాలని తల్లిదండ్రులకు రాయవరం జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటా తిరిగి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రైవేట్ కాలేజీలతో పోలిస్తే ప్రభుత్వ కాలేజీలు విద్యార్థులకు మెరుగైన అవకాశాలను అందిస్తున్నాయని వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, తక్కువ వ్యయంతో ఉన్నతమైన విద్య, ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, మధ్యాహ్న భోజన పథకాలు వంటి అనేక ప్రయోజనాలు ప్రభుత్వ కళాశాలల్లో లభిస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ కాలేజీల్లో అధిక ఫీజులు, ఒత్తిడి ఎక్కువగా ఉండగా, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ప్రతిభను అభివృద్ధి చేసే విధంగా బోధన జరుగుతుందని వివరించారు. అంతేకాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లొల్ల గ్రామంలోని తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంచి వేదిక అని అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లైబ్రేరియన్ సూర్యప్రకాశ్, సివిక్స్ లెక్చరర్ నారాయణ, జూలజీ లెక్చరర్ సుధాకర్ వర్మ, హిస్టరీ లెక్చరర్ శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి..

**"బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్" సమావేశంలో సివైఎఫ్ డైరెక్టర్ బి.హెచ్.వి మూర్తి రాజు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు జరుగుతున్నాయని ఇలాంటి సందర్భాలలో మధ్యకాలంలో దేశ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఒక కేసు తీర్పును ఆధారంగా చేసుకుని కొంతమంది క్రైస్తవ వ్యతిరేక శక్తులు సమాజంలో అలజడి సృష్టిస్తున్నాయని సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బి.హెచ్.వి మూర్తి రాజు ఆరోపించారు. సోమవారం కాకినాడ రూరల్ ఎఫ్.సి.ఐ కాలనీలో ఉన్న ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ మూర్తి రాజు అధ్యక్షతన సివైఎఫ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూర్తి రాజు మీడియాతో మాట్లాడుతూ ఈ దేశంలో క్రైస్తవ మిషనరీలు అనేక త్యాగాలు చేసి లక్షల కోట్లు విలువ చేసే భూములను దానం చేసి కుల మతాలకు అతీతంగా ఉచిత వైద్యాన్ని ,చదువును అందించారన్నారు. ఆ రోజుల్లో ఆ మిషనరీలు కులాన్ని ఏ మతాన్ని టార్గెట్ చేయకుండా అనేక మందికి సహాయాన్ని అందించారని గుర్తు చేశారు. అందుకే ప్రజలు దీనికి ఆకర్షితులే కులమతాలకతీతంగా క్రైస్తవ సమాజంలోకి మారారని తెలిపారు.ముఖ్యంగా సమాజంలో అస్పృశ్యతకు గురై అనేక అవమానాలు పొందుతున్న దళితలను క్రైస్తవ మిషనరీలు హక్కున చేర్చుకుని వారికి వైద్యాన్ని అందించి, చదువు నేర్పించారన్నారు. అందుకే నేడు ప్రధానంగా దళితులు అందరూ క్రీస్తు మార్గాన్ని అనుసరించడానికి ప్రధాన కారణమైయినదన్నారు. అందుకే మతతత్వ పెద్దలు, నాయకులు దళితులను విభజిస్తున్నారనిఆరోపించారు.సివైఎఫ్ సభ్యులు ప్రపంచ శాంతి కొరకు, దేశంలోనూ రాష్ట్రంలోనూ నెలకొన్న అనే విషయాలపై సమాధానం కొరకూ ప్రార్థనలు చేసామన్నారు. సివైఎఫ్ లీగల్ అడ్వైజర్ ప్రముఖ న్యాయవాది డేవిడ్ శ్యామ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చాలామంది మతతత్వ వాదులు ఆసరాగా తీసుకుని విస్తృత ప్రచారం చేశారన్నారు. ఒక వ్యక్తి మతం మారినంత మాత్రాన అతని సోషల్ స్టేటస్ మారదని నాయకులు గుర్తించాలని తెలిపారు. అనేక రంగాలలో ఎంత ఎదిగిన దళితలు వివక్ష మాత్రం పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ సమావేశంలో ట్రెజరర్ ఉషారాణి, సివైఎఫ్ నేషనల్ కోఆర్డినేటర్ జాన్ విక్లిఫ్, జిల్లా అధ్యక్షుడు మాసా సుధీర్ సన్నీ,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మచ్చా బుజ్జి బాబు, విజయ్ భాస్కర్, పెయ్యల నాని బాబు, రాజాల ప్రవీణ్, అకాను ఏసుదాసు,వారా వినోద్, వల్లూరి నానాజీ, తెలుగు రవి, చైతన్య, నిఖిల్, చినరాజు,రవి,శాలిని, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే వరుల సత్యప్రభ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గౌరవ విద్య, ఐటీ మరియు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ని విజయవాడ, ఉండవల్లిలోని వారి నివాసంలో, ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యల గురించి ఆయన తో చర్చించారు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఈ సందర్భంగా రోడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యా వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ వంటి కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అలాగే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటికి తక్షణ పరిష్కారాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, తగిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యేసత్యప్రభ మీడియాకి తెలియజేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన

# ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీయుటిఎఫ్ ఏలేశ్వరం మండల శాఖ ఆధ్వర్యంలో, నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ హోమ్ నందు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జట్ల సోమరాజు అధ్యక్షతన ఈరోజు పాలిటెక్నిక్ ఎంట్రాన్సుకు సంబంధించి ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగింది. 50 మంది విద్యార్థులు ఈ కోచింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని కోచింగ్‌కు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, జిల్లా అధ్యక్షులు సూరిబాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు సాయిరాం, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, ఎంఈవో బి.అబ్బాయి, మండల ప్రధాన కార్యదర్శి కె.రవి, సీనియర్ నాయకులు ఎం.రాంబాబు, గణపతి రావు, ఏబివి ప్రసాద్, మూర్తి, విశ్వనాథ్, రాజశేఖర్, మండల సెక్రటేరియట్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# గోదావరి రివర్ ఫ్రంట్ పనుల పురోగతి పరిశీలన


**త్వరితగతిన పూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆదేశం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను సోమ వారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా కలిసి పర్యవేక్షించారు. పనులు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ జారీ చేశారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి మే, జూన్ నెలల నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే వాసు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ రీటా, ఈఈ మదర్సా అలీ తదితర అధికారులు పాల్గొన్నారు.


# పసలపూడిలో ఘనంగా మన ఊరు - మన జెండా

**భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు - ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తమ్మిరెడ్డి**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో ప్రజలకు గర్భస్థ శిశువు నుండి మృతి అనంతరం జరిగే అంత్యక్రియల వరకు ప్రతి దశలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి పథకాలు నరేంద్ర మోడీ నాయకత్వంలో అందుతున్నాయని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, పసలపూడి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "మన ఊరు - మన జెండా" కార్యక్రమాన్ని గ్రామ కిసాన్ మోర్చా కమిటీ అధ్యక్షుడు సత్తి శ్రీరామారెడ్డి (రమేష్) అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చింతా తమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని, గర్భస్థ శిశువు నుండి మృతి అనంతరం జరిగే అంత్యక్రియల వరకు ప్రతి దశలోనూ కేంద్ర పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండా స్థంభానికి క్యూఆర్ కోడ్‌ను అమర్చినట్లు తెలిపారు. ఈ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామానికి అందిన అభివృద్ధి నిధులు, అమలవుతున్న పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రజలు సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. డిజిటల్ విధానంతో ప్రభుత్వ పనితీరును ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతా శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరావు, చింతా వెంకటరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మండ రామారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, పూడి శ్రీనివాసరావు, వారధి శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి శివయ్య, నల్లమిల్లి అయ్యప్పరెడ్డి, వెంకటేశ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# చతుర్వేద (4వేదములు) పండితులతో 'మహారుద్ర' పూజ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీమందేశ్వరస్వామివారి దేవస్థానం మందపల్లి ది.5/04/2026 నుండి 11/04/2026 వరకు చతుర్వేద (4వేదములు) పండితులతో "మహారుద్ర " పూజలో భాగంగా రెండవ రోజు ఉదయం తైలాభిషేకం అనంతరం సాయంత్రం 4.00 గంటలనుండి 6.00గంటల వరకు రుద్ర హోమం, విశేష నీరాజన మంత్రపుష్పములు వేదస్వస్తి కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు అని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
మంగళవారం, 07 ఏప్రిల్ 2026
www.viswamvoice.com



# “అమరావతి రాజధాని... కన్ఫ్యూజన్‌కు ఫుల్ స్టాప్”

**- అమరావతి రాజధానికి పార్లమెంట్ ఆమోదం - రాష్ట్ర భవిష్యత్తుకు వైకాపా అడ్డంకి**
**- టూరిజం.. స్పోర్ట్స్ హబ్‌గా రాజమండ్రి - వేగంగా అభివృద్ధి పనులు - నగరంలో రూ.7 కోట్ల సిఎసఆర్ అభివృద్ధి పనులు**
**- సీఎంఆర్ఎఫ్ ద్వారా కోట్ల రూపాయల సహాయం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 21 మందికి రూ.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర రాజధానికి అనేదానికి కన్ఫ్యూజన్ లేకుండా అమరావతే మన రాజధాని అని తమ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని పంపిన తీర్మానానికి పార్లమెంట్ కూడా ఆమోదం తెలపడం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న వైఎంవీఏ హాల్లో 19 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇద్దరికి ఎలఓసీలను మొత్తం రూ.32,01,762 విలువైన చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ఈరోజు నియోజకవర్గంలో 20 చెక్కులు, 2 ఎలఓసీల రూపంలో సుమారు రూ. 32 లక్షలకు పైగా సహాయం అందించామని చెప్పారు. నగరంలో ఇప్పటి వరకూ మొత్తం 532 మందికి రూ. 4,68,40,255 విలువైన చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఇంకా 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

**సీఎం సహాయ నిధి పేదలకు వరం :** ప్రజల సమస్యలను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేశారు. ఈ సహాయం అందించే కార్యక్రమంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

**అమరావతి... శాశ్వత రాజధాని :** గత వైకాపా ప్రభుత్వంలో రాజధాని విషయంలో తీవ్ర గందరగోళం నెలకొన్నదని విమర్శించారు. ఒకటా, మూడా, ఆరా అంటూ ప్రజలను అయోమయంలోకి నెట్టారని ఆక్షేపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయంతో అమరావతిని శాశ్వత రాజధానిగా నిర్ణయించి చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. రాజధానికి విషయంలో ఒక స్పష్టత తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

**వైసీపీపై ఘాటు వ్యాఖ్యలు :** రాజధాని అంశంలో వైసీపీ నేతల మాటల్లో స్థిరత్వం లేదని విమర్శించారు. గతంలో అమరావతిలో ఇల్లు కట్టుకున్నామని చెప్పి, తర్వాత మూడు రాజధానులు అంటూ జగన్ ప్రభుత్వం ప్రజలను గందరగోళంలోకి నెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు గట్టిగా తిరస్కరించినా మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి పార్టీ ఐదేళ్ల రాష్ట్రాన్ని పాలించడం మన దౌర్భాగ్యమన్నారు. ఇప్పుడు పిచ్చి పరాకాష్టకు చేరిందని, మళ్లీ కొత్తపేరు కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారన్నారు. మచిలీపట్నంలో “మా”, విజయవాడలోని “వి”, గుంటూరులోని “గన్” కలిపి మావిగన్ అంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ పిచ్చి ఇలాగే కొనసాగితే 2029 నాటికి కాకినాడలో “కా”, జగ్గంపేటలోని “జా” కలిపి “కాజా” చెయ్యాలంటారేమోనని చమత్కరించారు. జగన్ ఇలా ఉంటే ఆయన శిష్యులు మరోలా ఉన్నారని, గురుడు తానా అంటే శిష్యులు తందానా అంటున్నారని చమత్కరించారు.

**అభివృద్ధే మా సమాధానం :** ప్రతిపక్ష విమర్శలకు అభివృద్ధితోనే తాము సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. సుమారు రూ. 7 కోట్ల సీఎసఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేశామని, ఇంకా చేస్తున్నామన్నారు. నగరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. అందుకు సంబంధించిన పనులు 45 శాతం పూర్తయ్యాయన్నారు. మరో రెండు మూడు నెలల్లో గోదావరి రివర్ ఫ్రంట్ పనులు పూర్తయి ప్రారంభించనున్నామన్నారు.

**స్పోర్ట్స్ హబ్‌గా రాజమండ్రి :** క్రీడా రంగానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా మంజూరైన రూ. 14 కోట్లతో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కాబోతోందన్నారు.

**క్వారీ ప్రాంతానికి శాశ్వత నీటి పరిష్కారం :** క్వారీ ప్రాంత ప్రజల నీటి సమస్య పరిష్కారానికి రూ. 95 కోట్లతో భారీ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. 30 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నామన్నారు. ఇది పూర్తయితే క్వారీ ఏరియాలోని ఐదు వార్డులకు రోజుకు రెండు పూటల సమృద్ధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. టెండర్లు పూర్తయ్యాయి, పనులు ప్రారంభంకావాల్సి ఉందన్నారు.

**దేవాలయాల అభివృద్ధికి రూ. 9.10 కోట్లు :** ఎండోమెంట్స్ నిధుల ద్వారా నగరంలోని పలు దేవాలయాలు, సత్రాలు అభివృద్ధికి రూ. 9.10 కోట్లు మంజూరైనట్టు తెలిపారు.

**ఇంటర్నేషనల్ ఈవెంట్‌కు రాజమండ్రి వేదిక :** త్వరలో రాజమహేంద్రవరం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందబోతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ ఈవెంట్‌కు 25 దేశాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను హోటల్ మంజీరలో మంగళవారం అధికారికంగా వెల్లడిస్తామన్నారు. ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని, విమర్శలు నిర్మాణాత్మకంగా ఉంటే స్వాగతిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. “మా పనితీరే విమర్శకులకు తమ సమాధానం” అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు వర్రే శ్రీనివాసరావు, యిన్నమూరి దీపు, అత్తి సత్యనారాయణ, వై శ్రీను, ఉప్పులూరి జానకీ రామయ్య, కొయ్యల రమణ, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, నిమ్మలపూడి గోవింద్, తావ్వా రాజా తదితరులు పాల్గొన్నారు.

# 10న నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవం

**హాజరుకానున్న జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు, జె.ఎన్.యూ ప్రొఫెసర్ మహేంద్ర పి.లామా**
**గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాల ప్రదానం : నన్నయ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 16,17వ స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.టి.ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. యూని వర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాల ప్రదానం జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త, భారత ప్రభుత్వానికి చెందిన ప్రతిష్టాత్మక ‘జాతీయ భద్రతా సలహా మండలి’లో సభ్యుడు, భారతదేశంలోని సిక్కిం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్, జె.ఎన్.యూ సీనియర్ ప్రొఫెసర్ మహేంద్ర పి.లామా హాజరవుతున్నారని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరానికి చెందిన పిహెచ్.డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. ఈ 16,17వ స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 722 మంది విద్యార్థులు అప్లై చేసుకున్నారని చెప్పారు. ఈ 722 మందిలో పిహెచ్.డి 21, గోల్డ్ మెడల్స్ 14, ప్రైజ్ 10, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్.ఎల్.ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్.ఎల్.బి., బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారని తెలిపారు. రెండు విద్యా సంవత్సరాలలో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 6113 మంది, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 45337 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారని తెలియజేసారు. అతిథులుగా యాప్సి ఛైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. స్నాతకోత్సవానికి సంబంధించి విశ్వవిద్యాలయంలోని అధికారులు, అధ్యాపకులచే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన అతిపెద్ద పండుగ స్నాతకోత్సవం కాబట్టి దీనిని అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్షపు నీటి సంరక్షణతో భూగర్భ జలాలు పెరు గుతాయని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. జె.ఎస్.జె.బి.2.0లో భాగంగా ఎల్బీ నగర్ వాటర్ ట్యాంక్ పరిసరాలలో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి ప్రాధాన్యతను ప్రతిఒక్కరు గుర్తించాలన్నారు. ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భ జలాలది కీలకపాత్ర అని పేర్కొన్నారు. కనుక వర్షపు నీటి సంరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే వర్షపు నీరు నిల్వ ఉండే అవకాశముందో ఆయా ప్రాంతాలను ముందుగానే గుర్తించి.. సమీపంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కనుక జలం పరంగా భవిష్యత్తులో ఎటువంటి ముప్పు రాకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా వాననీటి సంరక్షణలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. తద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించిన వారవుతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ మాధవి, ఏఈ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 7న మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు - జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో సన్ రైస్ సాఫ్ట్వేర్ సొల్యూషన్, అర్ ఎస్ అర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, క్రెడ్ రైయిట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్కార్ట్, వేరహౌజ్, డీమార్ట్ మరియు కంపెనీలోని రాజమండ్రి పరిసర ప్రాంతంలో గల పలురకాల పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆయన తెలిపారు. 10, ఐ టీ ఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ నుండి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన, ఎమ్ బిఏ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా employment.ap.gov.inలింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ తెలిపారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## హాజరైన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో 47వ బిజెపి ఆవి ర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా జిల్లా పార్టీ ఆఫీసులో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ మండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విచ్చేసి పార్టీ జండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కార్యకర్తలు, నాయ కులు పార్టీ ఆఫీసు నుండి ర్యాలీగా వై-జంక్షన్, అశోక థియేటర్ చర్చ ముగ్గు పేట ప్రాంతం మీదుగా మాజీ ప్రధాని వాజపేయి విగ్రహం వద్దకు చేరుకుని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీ దగ్గుబాటి పురం దేశ్వరి మాట్లాడుతూబీజేపీ ఆవిర్భించి 46 సంవత్సరాలు పూర్తి చేసుకుని 47వ సంవత్సరంలోకి అడుగుపెడుతోం దని, 1980 సంవత్సరంలో జనసంఘ్ నుండి రాజకీయ విభాగంగా బిజెపి అవతరించిందని చెప్పారు. ఈ రోజు బీజేపీ కార్యకర్తలు ఆ రోజు మహనీయులు చేసిన త్యాగాలు, ఆత్మబలిదానాలు గుర్తు చేసుకుంటున్నారని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా పార్టీకి అంకితా భావంతో పనిచేసిన కార్యకర్తలను, మహానుభావులను స్మరించుకుంటూ తిరిగి బీజేపీ సేవ కు అంకితమవుదామని సంకల్పించాల్సిన రోజని అన్నారు.జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370నీ రద్దు చేసి, బీజేపీ భారత్ దేశంలో అంతర్ భాగాన్ని చేసిందని,ముస్లిం మైనారిటీ సోదరీమణులకు న్యాయం చేస్తామని చెప్పినట్టే ప్రధాని నరేంద్ర మోదీ ట్రిపుల్ తలాక్ ను రద్దు చేశారని పేర్కొన్నారు.సమాజంలో ఎటువంటి సంక్షేమాన్ని అందుకోకుండా దూరంగా ఉన్న బడుగుబలహీన వర్గాలవారికి , పేదలకి సైతం న్యాయం చెయ్యాలని అంతోదయ మూలసిద్దాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2014 వ సంవత్సరంలో అధికారం చేపట్టిన నుండి ఎన్డీఏ కూటమి చేసినట్టు వంటి అభివృద్ధి, ప్రవేశపెట్టిన ప్రతీ పథకం దేశంలో ఉన్న పేదవాళ్లకు న్యాయం చెయ్యాలన్న దిశగా వెళ్తున్నారని,బీజేపీ రాజకీయాన్ని దృష్టిలో పెట్టుకుని వెళ్ళే పార్టీ కాదని బీజేపీ కి ఓట్లతో సంబంధం లేదు కానీ ఈ దేశంలో ఉన్న ప్రజలకు న్యాయం చెయ్యాలి అన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని ఆమె తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్దత కల్పిస్తూ , ఎవ్వరు తొలగించలేని విధంగా , గతంలో మూడు రాజధానులు అని ఆట ఆడిన జగన్‌కి ఎటువంటి అవకాశం ఇవ్వకుండా చట్టబద్ధమైన స్థానం కల్పించిన ప్రధాని మోదీ, ఎన్డీఏ ప్రభుత్వానికి ఎంపి పురందేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ , నర్సిపల్లి హారిక, రేలంగి శ్రీదేవి పరిమి రాధా , ఏపీ ఆర్ చౌదరి ,వీర వీరాంజనేయులు ,యానాపు ఏసు, రవిశంకర్ ,మద్దిపాటి స్వర్ణ రజని, శ్రీవిద్య ,సూర్య కిరణ్ ,తగరం సురేష్ బాబు నరేష్ యాదవ్ , పవన్, మోహిని ,ఎర్ర నాగదేవి, కొల్లాపూర్ శీను, ఎమ్మెస్ కే రాజు ,శెట్టిపల్లి శివ నాగరాజు, డాక్టర్ ఉమా కాలేపు సత్య సాయిరాం, పడాల నాగరాజు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# శోభిత వర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**- శిబిరంలో సేవలను అందించిన ఆదిత్య కళాశాల విద్యార్థులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక శోభిత వర్మ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్లో నిర్వహించబడిన రక్తదాన శిబిరంలో ఆదిత్య ఎంసీఏ కు చెందిన ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు 50 మంది పాల్గొని వివిధ సేవలలో వారికి సహకరించారు. వచ్చిన వారికి భోజనాలు వడ్డించడం, రక్తదాన కార్యక్రమంలో సహాయం చేయడమే గాక 16 మంది రాజమండ్రి ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి,డాక్టర్ జివిఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు 71వ సారి రక్తదానం చేసి, స్థానికుల ప్రశంసలను పొందారనీ వారే వాలంటీర్లకు స్ఫూర్తి అని ఈ సందర్భంగా చెప్పారు. వారానికి నాలుగు కార్యక్రమాలు చేస్తూ ఆదివారం కూడా వదలకుండా స్వచ్ఛభారత్ క్లీన్ అండ్ గ్రీన్ వంటి కార్యక్రమాల్లో నేడు రక్తదానంలో తీర్చిదిద్దుతున్న ప్రోగ్రామ్ ఆఫీసర్లను పలువురు అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, మరియు యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్స్ అయిన డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు,డాక్టర్ బి హెచ్ వి రమాదేవిలను తోట సుబ్బారావు అభినందించారు. ఎన్..ఎస్.ఎస్.పి. ఓ. లు పోలుకొండ సాయి విమల, బి.కిరణ్ కుమార్ లు దీనికి సహకరించారు. ప్రిన్సిపాల్స్ శ్రీమతి లక్ష్మీ సరోజ, ఎస్కే రెహమాన్, ఎమ్. చంద్రశేఖర్, డి రామకృష్ణ, శ్రీరామ్ తదితరులు వాలంటీర్లను అభినందించారు.

# ఆధునిక బోధనలతో మరింత జ్ఞానసముపార్జన

**- వేడుకగా ఆర్యాపురం నారాయణ స్కూల్ గ్రాడ్యుయేషన్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక బోధనా పద్ధతులతో విద్యార్థులకు మరింత సాధ్యమని పలువురు వక్తలు అన్నారు.ఆర్యాపురం నారాయణ పాఠశాలలో ఈ- కిడ్స్, ఈ- ఛాంప్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుక ఏ.ఒ.ఎం ఎస్. కె.అలీషా, ప్రిన్సిపాల్ డి.వి.శైలజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ సయ్యద్ సిద్దిఖా, రాష్ట్ర బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబెర్ నర్సిపల్లి హారిక హాజరయ్యారు. ఈ- కిడ్జ్ ఆర్ హెడ్ సుస్మిత, ఈ ఛాంప్స్ ఆర్ ఏడి హెడ్ మోహిని హాజరై పి. పి-2, క్లాస్-5 పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు విద్యార్థులను ఉద్దేశించి అతిథులు ప్రసంగించారు. విద్యలో మార్పు ఆధునిక బోధనా పద్ధతులు, జ్ఞానం ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈ-కిడ్జ్ కో ఆర్డినేటర్ టి.హరిత, ఈ- ఛాంప్స్ కో ఆర్డినేటర్ మాధురి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కట్టుబాటును వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమలతో అందరిని అలరించారు.ఈ వేడుకలో తలిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని మరింత జోష్ తీసుకువచ్చారు. కార్యక్రమం విజయవంతంలో వైస్ ప్రిన్సిపాల్స్ అపర్ణ, లక్ష్మీ భవాని, ఉపాధ్యాయులు సంపూర్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రిన్సిపాల్ శైలజ తల్లిదండ్రుల నిరంతర, సంపూర్ణ సహకారానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రహదారుల నాణ్యతను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్ల నిర్మాణం, నిర్వహణ, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. సోమవారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఆదర్స్ నగర్ తో పాటు మహాలక్ష్మి టెంపుల్ పార్క్ వద్ద పూర్తి చేసిన రహదారుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అభివృద్ధి పనుల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా చెక్ చేయాలని సూచించారు. పర్యవేక్షణ చేసే ఇంజనీర్లు కూడా పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. లెవెల్స్ సరి చూసుకుంటూ రాబోవు కాలంలో నగర వాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వీఎల్ పురం ఆల్ బ్యాంక్ కాలనీలో పూడ్చిన గుంతలను పరిశీలించారు. ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించేలా.. గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దడమే అత్యంత ప్రాధాన్యతాంశంగా ముందుకు వెళ్ళాలన్నారు. ఈ పర్యటనలో ఎస్‌ఈ రీటా, డీఈ లోవరాజు, ఏఈ దుర్గాప్రసాద్, ఇతర ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉన్నారు.



మొహం మీదే ఆ మాట అనేశాడు..

# ఆ హీరో కుళ్లు బుద్ధి చూసి చిరాకొచ్చింది..

అడిశి శేష్ హాట్ కామెంట్స్



హీరో అడివి శేస్ తన లేటెస్ట్ సినిమా డెకాయిట్ ప్రమోషన్లలో బిజీ బిజీగా ఉంటున్నాడు. వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తు తన సినిమాను జనాల్లోకి తీసుకెళుతున్నాడు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన అడివి శేష్ ఒక స్టార్ హీరో గురించి షాకింగ్ కామెంట్స్ చేశాడు. సినిమా ఇండస్ట్రీలో స్వయం కృషితో ఎదిగిన హీరోల్లో అడివి శేష్ ఒకరు. మొదట్లో పలు సినిమాల్లో సహాయక నటుడిగా, విలన్‌గా మెప్పించిన అతను ఇప్పుడు తెలుగులో క్రేజీ హీరోగా రాణిస్తున్నాడు. కేవలం నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగానూ సత్తా చాటుతున్నాడు. క్షణం, గూఢచారి, ఎవరు, మేజర్, హిట్ 2 సినిమాలతో హీరోగా బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ అందుకున్న శేష్ ఇప్పుడు డెకాయిట్ తో మన ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ ప్రేమకథా చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో సినిమా ప్రమోషన్లలో బిజి బిజీగా ఉంటున్నాడు శేష్. ఇందులో భాగంగానే పలు టీవీ, యూట్యూబ్ ఛానెల్స్ కు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఈ సందర్భంగా తన పర్సనల్ అండ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నాడు. అయితే తాజాగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూకు హాజరైన శేష్ తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక ఆసక్తికర సంఘటనను పంచుకున్నాడు. ఈ సందర్భంగా ఓ యంగ్ హీరో గురించి మాట్లాడిన అడివి శేష్.. 'ఓ యాక్టర్ పేరు చెప్పను.. కానీ.. నా ప్రొడ్యూసర్ బర్త్ డే సందర్భంగా కలిశా. 'నువ్వు ఎప్పుడూ ఇలాంటి చిన్న సినిమాలే చేస్తావా? నాలాంటి పెద్ద సినిమాలు ఎప్పుడు చేస్తావ్?" అని ఆ హీరో నేరుగా అడిగాడు.అతను చెప్పింది తెలుగులో చెబితే ఎవరో అర్థమైపోతుంది. అందుకే ఇంగ్లిష్ లో చెబుతున్నా. ఆయన మాటలకు నాకు చిరాకొచ్చింది. 'నీ కుళ్లు బుద్ధి ఎప్పటికీ మారదు' అని మనసులోనే అనుకున్నాను' అని చెప్పుకొచ్చాడు శేష్. అయితే ఆ హీరో ఎవరనేది మాత్రం శేష్ బయటపెట్టలేదు. ప్రస్తుతం డెకాయిట్ హీరో చేసిన కామెంట్స్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. అడివి శేష్ తో అమర్యాదగా ప్రవర్తించిన ఆ హీరో ఎవరబ్బా? అని సోషల్ మీడియాలో నెటిజన్లు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

# సీరియల్స్ మానేసిన శోభా శెట్టి ఇప్పుడేం చేస్తుందో తెలుసా?

## ఒక్కో నెలలో అన్ని లక్షలు సంపాదిస్తుందా?

కార్తీక దీపం సీరియల్ తో ఫేమస్ అయిన శోభా శెట్టి బిగ్ బాస్ తెలుగు ఏడో సీజన్ లో కంటెస్టెంట్‌గా పార్టిసిపేట్ చేసింది. విజేతగా నిలవకపోయినా మంచి గుర్తింపే సంపాదించుకుంది. అయితే బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత సీరియల్స్ కు పూర్తిగా దూరమైందీ అందాల తార. బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో కన్నడ నటి శోభా శెట్టి ఒకరు. బిగ్ బాస్ ఏడో సీజన్ లో కంటెస్టెంట్ గా పార్టిసిపేట్ చేసిన శోభా టైటిల్ గెలవనప్పటికీ తన ఆట, మాట తీరుతో బిగ్ బాస్ ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. ఇక కన్నడ బిగ్ బాస్ సీజన్ 11లోనూ వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చింది శోభా శెట్టి. అయితే అక్కడ ఎక్కువ రోజులు ఉండలేక వెంటనే బయటకు వచ్చేసింది. కాగా బిగ్ బాస్ కంటే ముందు శోభా శెట్టికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది సీరియల్సే. ముఖ్యంగా కార్తీక దీపంలో మోనితగా ఆమె నటనను ఎవరూ అంత ఈజీగా మర్చిపోలేదు. అయితే బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఒక్క సీరియల్ లోనూ కనిపించలేదు శోభ. చివరకు తనకు ఎంతగానో క్రేజ్ తెచ్చిపెట్టిన కార్తీక దీపం సీక్వెల్ (కార్తీక దీపం 2 ఇది నవ వసంతం) లోనూ ఆమె కనిపించలేదు. ఇందులో శోభా పాత్రను గాయత్రి సింహాద్రి రీప్లేస్ చేసింది. అయితే సీరియల్స్ చేయనప్పటికీ అడపా దడపా టీవీ షోస్, ప్రోగ్రామ్స్ లో సందడి చేస్తోందీ అందాల తార. అలాగే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. ముఖ్యంగా యూట్యూబ్ ఛానెల్ తో ఎక్కువగా ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటోంది. ఈ నేపథ్యంలో యూట్యూబ్ ఛానెల్ ద్వారానే శోభా శెట్టికి భారీ ఆదాయం వస్తోందని తెలుస్తోంది. శోభా శెట్టికి సోషల్ మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ఆమె యూట్యూబ్ ఛానెల్ కు దాదాపు 7.07 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇక శోభా శెట్టి తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను ఎక్కువగా సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. ముఖ్యంగా ఆమె వీడియోలకు యూట్యూబ్ లో మంచి స్పందన వస్తోంది. ఒక్కో వీడియోకు మిలియన్ల కొద్దీ వ్యూస్ వస్తుంటాయి. వీటి ద్వారా నెలకు దాదాపు 10 లక్షల వరకు ఆదాయం వస్తోందని తెలుస్తోంది. కాగా శోభా శెట్టి తన తోటి నటుడు యశ్వంత్ (కార్తీక దీపం ఫేమ్) తో ప్రేమలో ఉంది. గతంలో వీరు ఎంగేజ్మెంట్ చేసుకున్నారని కూడా ప్రచారం జరిగింది. పెళ్లిపీటలెక్కనున్నారని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇప్పటివరకు తమ పెళ్లిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదీ లవ్ బర్డ్స్.



# వర్షం వల్ల మ్యాచ్ రద్దు.. కోల్‌కతా, పంజాబ్ జట్లకు చెరో పాయింట్

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 3.4 ఓవర్ల వద్ద వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దీంతో ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. ఆ సమయానికి కోల్‌కతా జట్టు 2 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసింది. క్రీజులో అజింక్య రహానే (8), అంగ్క్రిష్ రఘువంశీ (7) నాటౌట్‌గా ఉన్నారు. జేవియర్ బార్ట్‌లెట్ తన తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఫిన్ అలెన్ (6), కామెరూన్ గ్రీన్ (4)ను



పెవిలియన్‌కు పంపాడు. 12 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయిన కోల్‌కతా, 16 రన్స్ వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది. అయితే మొదట చిన్నగా ప్రారంభమైన వర్షం.. తర్వాత జోరందుకుంది. బలమైన గాలులు సైతం వీచాయి. ఎట్టకేలకు వర్షం ఆగినా.. ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో అయిదు ఓవర్ల ఆట కూడా సాధ్యం కాదని తేల్చారు. అనంతరం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ ఖాతాలో అయిదు పాయింట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్ ఖాతాలో ఒక పాయింట్ ఉన్నాయి.

# హ్యాట్రిక్ ఓటములున్నా.. చెన్నై ప్లేఆఫ్స్ చేరే ఛాన్స్.. ఎలాగో తెలుసా?

ఐపీఎల్ 2026లో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ప్రయాణం ఊహించని రీతిలో సాగుతోంది. ఆడిన మొదటి మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలై హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. రాజస్థాన్, పంజాబ్, బెంగళూరు జట్ల చేతిలో ఓడిపోయిన చెన్నై, తిరిగి ఫామ్ లోకి రావాలంటే జట్టులో కీలక మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో చెన్నై ప్రధాన సమస్య బౌలింగ్. ముఖ్యంగా పవర్ ప్లే, చివరి ఓవర్లలో ప్రత్యర్థి జట్టును అడ్డుకోవడంలో బౌలర్లు విఫలమవుతున్నారు. తక్కువ పరుగులు ఇచ్చి వికెట్లు తీయగల బౌలర్ అవసరం జట్టుకు ఉంది. వెస్టిండీస్ స్పిన్నర్ అకీల్ హోసేన్‌ను తుది జట్టులోకి తీసుకోవడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చు. అకీల్ పవర్ ప్లేలో పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా, వికెట్లు తీయడంలోనూ దిట్ట. ఇతని అనుభవం జట్టుకు ఎంతో కీలకం కానుంది.



### మిడిలార్డర్‌లో మార్పులు..

చెన్నై జట్టు మిడిలార్డర్ బ్యాటింగ్ ప్రస్తుతం బలహీనంగా కనిపిస్తోంది. కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన యువ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ఈ క్రమంలో విధ్వంసకర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను జట్టులోకి తీసుకురావడం మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఢిల్లీతో జరగబోయే తదుపరి మ్యాచ్ నాటికి బ్రెవిస్ పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉండటంతో, అతను జట్టులోకి వస్తే బ్యాటింగ్ విభాగం మరింత బలోపేతం అవుతుంది.

### ధోనీ మార్గదర్శనం, వ్యూహాలు..

మైదానంలో ఎంఎస్ ధోనీ ఉంటే ఆ ప్రభావమే వేరుగా ఉంటుంది. వికెట్ల వెనుక ఉండి బౌలర్లకు సూచనలు ఇవ్వడంలో, క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ధోనీకి సాటి ఎవరూ లేరు. గత మూడు మ్యాచ్‌ల్లో ధోనీ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అతని రాక జట్టులో నూతన ఉత్తేజాన్ని నింపుతుంది. దీంతో పాటు యువ ఫాస్ట్ బౌలర్ రామకృష్ణ ఘోష్‌కు అవకాశం ఇస్తే డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రించే వీలుంటుంది.

### రాయుడు ఆశాభావం..

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కూడా చెన్నై పునరాగమనంపై ధీమా వ్యక్తం చేశారు. గతంలో కూడా చెన్నై ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి గెలిచిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. జట్టులో సానుకూల మార్పులు జరిగితే ప్లేఆఫ్స్ చేరడం అసాధ్యమేమీ కాదని రాయుడు అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా డెత్ బౌలింగ్, కీలక ఆటగాళ్ల పునరాగమనం జట్టు తలరాతను మారుస్తుందని ఆయన పేర్కొన్నాడు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com